
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత మంగళవారం గరిష్ఠం : 39.0 కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 9 ఏప్రిల్ 2025

మీ బట్టలు ఊడదీస్తాం..!

చంద్రబాబు పాలన ఎల్లకాలం ఉండదు

పోలీసులకు మాజీ సీఎం జగన్ వార్నింగ్

మజ్జిగ లింగమయ్య కుటుంబానికి పరామర్శ

హెలీప్యాడ్ వద్ద వైసీపీ నాయకుల హల్‌చల్


పాపిరెడ్డిపల్లిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్

రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన మాజీ సీఎం జగన్ పోలీసులపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి రాగానే బట్టలు ఊడదీస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో కొందరు పోలీసులు టీడీపీ నాయకులకు వాచ్‌మెన్‌లుగా పనిచేస్తున్నారని, అలాంటి వారిని గుర్తుకు పెట్టుకుని మరీ ఉద్యోగాలు ఊడదీస్తామని హెచ్చరించారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వారం క్రితం జరిగిన ఘర్షణలో మృతిచెందిన మజ్జిగ లింగమయ్య కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించారు. లింగమయ్య భార్య రామాంజినమ్మ, కుమారులు మనోహర్, శ్రీనివాసులుతో మాట్లాడారు. అంతకు మునుపు లింగమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జరిగిన సంఘటన గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. లింగమయ్య కుమారులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, వైసీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పోలీసులు తమ విధులను మరచి, టీడీపీ ప్రజాప్రతినిధులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ గురించి పరుషంగా మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే, ఆమె కుమారుడితో తమ పార్టీ ఎంపీటీసీల చేత వీడియో కాల్‌లో మాట్లాడించారని ఆరోపించారు. రామగిరి మండలంలో సంఖ్యాబలం లేకపోయినా టీడీపీ నాయకులు ఎంపీపీ పదవి కోసం బెదిరింపులకు దిగారని, పోలీసుల అండతో భయభ్రాంతులకు గురిచేశారని అన్నారు. పెనుకొండలో బైండోవర్ చేసి, టీడీపీ వారిని రప్పించి తమ ఎంపీటీసీ సభ్యులను కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ ఘటనలో తిరిగి తమ పార్టీ నాయకులపైనే కేసులు నమోదు చేయించారని అన్నారు. చంద్రబాబు పాలన ఎల్లకాలం ఉండదని, తాము అధికారంలోకి వచ్చాక తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని ఆయన పోలీసులను హెచ్చరించారు. ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంలోనే, ఇదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడిపై టీడీపీ వర్గీయులు దాడికి తెగబడ్డారని, అడ్డుకున్నందుకు లింగమయ్యపై, ఆయన కుమారుడిపై దాడి చేశారని ఆరోపించారు. ఈ దాడిలో లింగమయ్య మృతి చెందితే ఆయన భార్య రామాంజినమ్మతో సంతకం చేయించుకుని..


లింగమయ్య కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న జగన్

(మిగతా 7వ పేజీలో...)

డిమాండ్లు పరిష్కరిస్తేనే సమ్మె విరమణ

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు


కార్మికులతో చర్చలు జరుపుతున్న అధికారులు

అనంతపురం న్యూటౌన్ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): డిమాండ్లు పరిష్కరిస్తే తప్ప సమ్మె విరమించేదిలేదని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తెగేసి చెప్పారు. డిమాండ్ల సాధనకు 4 రోజులుగా విధులను బహిష్కరించి కార్మికులు సమ్మె బాట పట్టారు. ఈఈ మురళీధర్‌రావు, డీఈ శ్రీనివాసులు మంగళవారం సమ్మె చేస్తున్న కార్మికులకు వద్దకు వెళ్లి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఉమ్మడి జిల్లాలోని ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం, పెనుకొండ మండలాల్లోని 727 గ్రామాలకు పీఏబీఆర్ నుండి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీటిని అందించడానికి 588 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి 5 నెలల వేతనాలు పెండింగ్ ఉన్నాయి. అలాగే ఈపీఎఫ్ జమ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. ఈనేపథ్యంలోనే పలు మార్లు కార్మికులు సమ్మెబాట పట్టారు. అయితే అధికారులు తాత్కాలిక చర్యలతో సమ్మెను విరమింపజేస్తూ వచ్చారు. కానీ ఈ సారి మాత్రం తమ సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె విరమించే ప్రసక్తేలేదని చెప్పడం, ఈ వేసవిలో అధికారులకు మరింత మంట పుట్టిస్తోంది.

నేడు దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల పంపిణీ

అనంతపురం విద్య, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం పలువురు దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు ఏపీసీ శైలజ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా దివ్యాంగ పిల్లలకు అవసరమైన పరికరాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 244 మంది పిల్లలకు రూ.21.55 లక్షల విలువ చేసే ఉపకరణాలను పాతూరులోని కస్తూర్బా హైస్కూల్‌లో అందజేస్తామన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో ముందుకే..

గత ప్రభుత్వ తీరుతో ఆర్థిక సంక్షోభం

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

విడపనకల్లులో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక


మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

విడపనకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు వెళ్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ అధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం సభలో కేశవ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని గత ప్రభు త్వం అప్పుల పాలు చేసి వెళ్లిందని, వాటికి వడ్డీలు చెలించేందుకు, తీర్చేందుకు రాష్ట్ర బడ్జెట్ సరిపోవటం లేదన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో హంద్రీనీవా పనులు పూర్తి అయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్క రించేందుకే ఈ వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ సమస్యలపై 464 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఉండబండలో వైసీపీ నాయకులు ఆక్రమించుకున్న పాఠశాల భవనాలను ఖాళీ చేయించాలని ఆ గ్రామ ప్రజలు మంత్రి పయ్యావులకు ఫిర్యాదు చేశారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి

ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్ కొట్టాల, డొనేకల్లు గ్రామాల ప్రజలు మంత్రి కేశవ్‌కు పిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో ఓ అధికారి వైసీపీ కార్యకర్తలా పని చేసి ఆపార్టీ నాయకులకు ఉపాధి నిధులు దాదాపు 1.19కోట్లు దోచి పెట్టారు అంటూ ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ప్రజలే ఆధారాలు తెచ్చి ముందు పెడుతున్నా గత పీఓ(ఎంపీడీఓ) శ్రీనివాసులుపై ఎందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయలేదు అంటూ డ్వామా పీడీ సలీంబాషాపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుచేసిన అధికారిని రక్షించి మీరు తప్పు చేయ వద్దు అంటూ హెచ్చరించారు.

- మండలంలోని పెద్దకొట్లాలపల్లి రైతులు మాట్లాడుతూ గత రబీలో జింకల వల్ల రెండు వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినా అధికారులు పట్టించుకోలేదన్నారు. నష్ట పరిహారం ఇప్పించాలని మంత్రిని కోరారు. వ్యవసాయ అధికారిని ఉమామహేశ్వరమ్మను, మండల ఏఓ పెన్నయ్యను వేదిక మీదికి పిలిపించి ఎందుకు నివేదికలు పంపలేదు అంటూ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు అని హెచ్చరించారు.
- ట్రాన్స్‌ఫార్మర్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణం, సామాజిక పింఛన్లు, భూ సర్వేలు కోసం అర్జీలను మండల ప్రజలు అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మలోలా, జిల్లా ఫారెస్టు అధికారి రామక్రిష్టారెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, సీఈఓ రామచంద్రా రెడ్డి, మండల అధికారులు, టీడీపీ నాయకులు చిన్న మారయ్య, మాజీ ఎంపీపీ ప్రతాప్‌నాయుడు, సర్పంచ్‌లు చంద్రశేఖర్, తిమ్మరాజు, తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు పీహెచ్‌సీకి జాతీయస్థాయి సర్టిఫికెట్


మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న వైద్యాధికారి శివకృష్ణ

రాప్తాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాని(పీహెచ్‌సీ)కి జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల సర్టిఫికెట్ దక్కిందని వైద్యాధికారి శివకృష్ణ తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో మెరుగైన పనితీరు కనబరచినందుకు ఈ సర్టిఫికెట్ లభించిందన్నారు. మంగళవారం అనంతపురంలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సర్టిఫికెట్ అందజేశారన్నారు. చిన్మయ్‌నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి కూడా జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల సర్టిఫికెట్ దక్కగా.. ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న, ఏఎన్‌ఎం చంద్రకళ అందుకున్నారన్నారు.

ప్రమోషన్లు ఇవ్వండి మహాప్రభో..!

2023లో రాష్ట్రంలో ఎస్ఏ ఇంగ్లిష్ ఉద్యోగోన్నతులు

కోర్టు కేసు కారణంగా ఉమ్మడి జిల్లాలో నిలిపివేత

ఎట్టకేలకు కోర్టులో ఊరట

ఇప్పుడైనా ఇవ్వాలంటూ వేడుకోలు



ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్న కుందుర్పి మండలం కొలిమిపాళ్యం ఉన్నత పాఠశాల

అనంతపురం విద్య, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ ఇవ్వాలంటూ ఆశావహ టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇతర జిల్లాల్లో ఈ ప్రక్రియ గతంలోనే పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలో మాత్రం కోర్టు కేసుల కారణంగా పెండింగ్‌లో పెట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 230 మంది టీచర్లకు అన్యాయం వాటిల్లుతోంది. ఇతర జిల్లాల్లో ఇప్పటికే ప్రమోషన్లు పొందితే... ఇక్కడ మాత్రం ఎదురుచూస్తున్నారు. 2023 నుంచి పోరాటం చేస్తున్నారు. అడ్డుగా ఉన్న కేసులను ఇటీవల హైకోర్టు డిస్పోజ్ చేసింది. ప్రమోషన్ల విషయంలో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ఆశావహ టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రమోషన్లు ఇవ్వాలని అటు ప్రభుత్వాన్ని, ఇటు విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.


కోర్టు కేసుల గ్రహణం

రెండేళ్ల కిందట సీనియర్ సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చారు. 2023 జనవరిలో సీనియర్ ఎస్‌జీటీలకు అడ్‌హక్ కింద ఎస్‌ఏ - ఇంగ్లిష్ 230 మందికి ఉద్యోగోన్నతి కల్పించారు. రూ.2500 అలవెన్సు ఇచ్చారు. 2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకూ అప్పుడు అడ్‌హక్ ప్రమోషన్ (వర్క్ అడ్జస్ట్‌మెంట్) తీసుకున్న టీచర్లు పనిచేశారు. 2023 ప్రమోషన్ల సమయంలో కోర్టు కేసులు ప్రమోషన్లకు అడ్డంకిగా మారాయి. 2019 డిసెంబర్‌లో కొందరు టీచర్లు డిగ్రీల్లో ఇంగ్లిష్ చదివిన వారికే ప్రమోషన్లు ఇవ్వాలని కోర్టులో కేసులు వేశారు. 2023 జూన్‌లో రెగ్యులర్ ప్రమోషన్లకు ముందు కోర్టు నుంచి వచ్చిన స్టేటస్ కో కారణంగా ప్రమోషన్లు ఆగిపోయాయి. ప్రమోషన్ల ముందు.. కోర్టు నుంచి స్టేటస్ కో రావడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆగిపోయాయి. 2023 జూన్‌లో మిగిలిన అన్ని సబ్జెక్టులకు ప్రమోషన్లు కల్పించారు. ఇతర జిల్లాల్లో సైతం స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ప్రమోషన్లు ఇచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రమోషన్లు పట్టాలెక్కలేదు. ఫలితంగా 230 మందికి అన్యాయం జరిగింది. అప్పటి నుంచీ బాధితులు పోరాటం చేస్తూనే ఉన్నారు. రెగ్యులర్ ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లు లేక విద్యార్థులకు అన్యాయం వాటిల్లిందనే చెప్పాలి.

ఆశావహుల్లో ఆనందం

ప్రమోషన్లపై నమోదైన పిటీషన్లను ఇటీవల హైకోర్టు తోసిపుచ్చింది. ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్లపై నిర్ణయం తీసుకోవాలంటూ ప్రభుత్వానికి ఆదేశాలిచ్చింది. ఫిబ్రవరిలో ఈ మేరకు హైకోర్టు తీర్పు రావడంతో ప్రమోషన్లకు అడ్డంకి తొలగినట్టేనంటూ ఆశావహ టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 280 వరకూ ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ ఉన్నాయనీ, వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని కోరుతున్నారు.

చాలామందికి అన్యాయం



2023లో ఇతర జిల్లాల్లో సైతం ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు కల్పించారు. కోర్టు కేసుల కారణంగా ఉమ్మడి జిల్లాలో 230 మంది వరకూ నష్టపోయారు. వారిలో కొందరు ఇప్పటికే రిటైరయ్యారు కూడా. కేసులను కోర్టు డిస్పోజ్ చేయడంతో వెంటనే ప్రమోషన్లు కల్పించారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న 280 ఖాళీలను భర్తీ చేసి, బాధితులకు న్యాయం చేయాలి.

- సూర్యుడు, ఎస్టీయూ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి

ఇంగ్లిష్ బోధనకు ఆటంకం



అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని చాలా హైస్కూళ్లలో రెగ్యులర్ ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లు లేక బోధన కుంటుపడుతోంది. విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం వెంటనే ఎస్ఏ ఇంగ్లిష్ ప్రమోషన్లు ఇవ్వాలి. విద్యార్థులు, టీచర్లకు న్యాయం చేయాలి.

- శ్రీదేవి, సీనియర్ ఎస్జీటీ, ఎంపీయూపీ స్కూల్, జంబులదిన్నె

ప్రభుత్వ నిర్ణయం మేరకు ముందుకెళ్తాం..



ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లపై కొంతకాలంగా సమస్య నడుస్తోంది. 2019లో కొందరు డీఈఓకు అప్పీల్ చేసుకున్నారు. దీనిపై 2023లో కోర్టు నుంచి స్టేటస్ కో రావడంతో అప్పట్లో ప్రమోషన్లు ఆగాయి. ఇటీవల ఆ కేసులను కోర్టు డిస్పోజ్ చేసింది. 2019లో అప్పటి టీచర్లు ఇచ్చిన రెప్రజెంటేషన్, దానికి సంబంధించిన ఫైల్ వివరాలను ఇటీవలే విద్యాశాఖ ఉన్నతాధికారులకు రాసి పంపాం. ప్రభుత్వం నుంచే వచ్చే ఆదేశాల మేరకు ప్రమోషన్లపై ముందుకెళతాం.

- ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం


పేలుడు తీవ్రతకు బీటలువారిన ఇల్లు

క్వారీల్లో పేలుళ్లు..
ఇళ్లలో పగుళ్లు..!

- బ్లాస్టింగ్‌లతో గోడలకు బీటలు
- భయంభయంగా ఉంటున్న జనం
- పట్టించుకోని అధికారులు

డి.హీరేహాళ్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): క్వారీల్లో నిత్యం భారీఎత్తున బ్లాస్టింగ్‌లు చేస్తుండడంతో గ్రామాల్లో ప్రజలు ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని కొన్ని క్వారీల్లో భయంకరమైన పేలుళ్ల ధాటికి సమీప గ్రామాల్లోని ఇళ్లలో గోడలు దెబ్బతింటున్నాయి. గోడలు బీటలు బారుతున్నాయి. పేలుళ్ల ధాటికి ఇళ్లు ఎక్కడ కూలుతాయోనని జనం భయంభయంగా గడుపుతున్నారు. క్వారీల్లో బ్లాస్టింగ్‌లు చేస్తూ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. సమీప గ్రామాల ప్రజలు మాత్రం నివాసాలను కోల్పోతున్నారు. మండల వ్యాప్తంగా 10 వరకు క్వారీలున్నాయి. వీటిలో ఒకట్రెండు తప్ప.. మిగతా అన్నింట్లో అక్రమ బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారు. పులకుర్తి, వసగుడ్డం గ్రామాల సమీపంలోని క్వారీ అనుమతులు పొందకుండానే నిర్వహిస్తున్నారు. భారీ బ్లాస్టింగ్‌లు చేస్తుండడంతో ఇరు గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. హిర్దేహాళ్ గ్రామ సమీపాన, సోమలాపురం వద్ద క్వారీలను అక్రమంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, అక్రమ బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్న క్వారీలపై చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు.

భయంభయంగా గడుపుతున్నాం..



గ్రామ సమీపంలోని క్వారీలో నిత్యం బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. ఆ ధాటికి ఇళ్లు భూకంపం వచ్చిన తరహాలో కంపిస్తున్నాయి. బ్లాస్టింగ్ సమయంలో ప్రాణభయంతో కుటుంబసభ్యులు మొత్తం ఇంటి నుంచి బయటకు పరుగులు తీయాల్సి వస్తోంది. విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ప్రయోజనం లేదు. గ్రామాన్ని వీడాల్సిన దుస్థితి దాపురించింది.

- రాముడు, పులకుర్తి గ్రామం

పంటలు దెబ్బతింటున్నాయి..



క్వారీల్లో బ్లాస్టింగ్, వాటి నుంచే వెలువడే దుమ్ము, ధూళి కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. పొలాల్లోకి వెళ్లాలన్నా భయమేస్తోంది. పనులను అడ్డుకున్నపుడు మాత్రం తూతూమంత్రంగా ఐదారుగురు రైతులకు పరిహారం అందించి, చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు మాత్రం.. క్వారీ యజమానులకే వత్తాసు పలుకుతున్నారు.

- గులెప్ప, వసగుడ్డం

అక్రమ బ్లాస్టింగ్‌పై చర్యలు



క్వారీల్లో అక్రమ బ్లాస్టింగ్‌లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. క్వారీల నిర్వహణకు అన్ని అనుమతులు తప్పనిసరి. వీటిపై విచారించి, అనుమతులు లేని, గ్రామస్థులకు ఇబ్బందికరంగా మారిన క్వారీలపై చర్యలు చేపడతాం.

-మునివేలు, తహసీల్దార్

డీఎస్పీ వీరరాఘవరెడ్డిపై కేసు

కొవిడ్ సమయంలో తండ్రీకొడుకులపై దాడి చేసినందుకు..

అనంతపురం క్రైం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో అనంతపురం నగరానికి చెందిన తండ్రీకొడుకులను కొట్టిన ఘటనపై అప్పటి డీఎస్పీ వీరరాఘవరెడ్డిపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు.. సోషల్ వర్కర్ కేపీ రాజు కమలానగర్‌లో గీతాంజలి హ్యాండి క్రాఫ్ట్ నిర్వహిస్తున్నారు. 2021 మే 18న మధ్యాహ్నం కుమారుడితో కలిసి షాపు నుంచి స్కూటీలో ఇంటికి బయల్దేరారు. తాళం చెవి కనిపించకపోవడంతో వెతికేందుకు డిక్కీ తెరిచారు. అదే సమయంలో అప్పటి అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి వెనుక నుంచి వచ్చి అసభ్య పదజాలంతో దూషించి తనను, తన కుమారుడు పవన్‌ను లాఠీతో చితకబాది, తన వాహనాన్ని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో అప్పగించారని బాధితుడు వాపోయాడు. తండ్రీ కొడుకులు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందారు. ఈ ఘటనపై అదేనెల 21వ తేదీన వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఎట్టకేలకు మంగళవారం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2021 నుంచి ఆ ఘటనపై కేసు నమోదుకు సంబంధించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని బాధితుడు వాపోయారు. ప్రస్తుత ఎస్పీ, డీఐజీల దృష్టికి తీసుకెళ్లడంతో డీఎస్పీపై కేసు నమోదు చేశారని బాధితుడు కేపీ రాజు తెలిపారు.

570 మార్కులు సాధిస్తే విమానం ఎక్కిస్తా

పదో తరగతి విద్యార్థులకు ఎంఈఓ బంపర్ ఆఫర్

సొంత మండలంలో విద్యాభివృద్ధికి కృషి

పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలల అభివృద్ధి

6లో

గుంతలకు గుడ్ బై!


అధరాలి..!

ఆశాజనంగా చీనీ దిగుబడులు


గంపెడు ఆశలు పెట్టుకున్న రైతులు

గిట్టుబాటు ధర దక్కితే లాభాలే..





మన్నీలలో కోసిన చీనీకాయలు



అనంత మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చీనీ సీజన్ మొదలైంది. పంటపై రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనంగా ఉన్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. ప్రస్తుతం అనంత వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్‌కు వస్తున్న ఉత్పత్తులను బట్టి చూస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. నాలుగైదు రోజులుగా వెయ్యి టన్నులకుపైగా చీనీ ఉత్పత్తులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. దిగుబడులకు అనుగుణంగా మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కితే ఈఏడు రైతుల పంట పండినట్లే.

40వేల హెక్టార్లలో సాగు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 40వేల హెక్టార్లలో చీనీ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 30వేల హెక్టార్లలో దిగుబడులు వస్తున్నట్లు సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. గతేడాది కంటే ఈసారి దిగుబడులు మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. గతేడాది హెక్టారుకు 15 నుంచి 17 టన్నుల దిగుబడులు వచ్చినట్లు ఉద్యాన శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ ఏడాది 20 నుంచి 21 టన్నుల దిగుబడులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడం, నీటి లభ్యత బాగుండడమే ఇందుకు కారణమని అన్నదాతలు పేర్కొంటున్నారు.

గిట్టుబాటు ధర దక్కితే..

దిగుబడులకు అనుగుణంగా గిట్టుబాటు ధర దక్కితే లాభాల పంట పండినట్లేనని అన్నదాతలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మందులు, స్ప్రేయింగ్ ఇతరత్రా వాటితో కలుపుకుని ఎక రా నికి రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడుల రూపంలో ఖర్చవుతున్నట్లు రైతులు అంటున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో టన్ను రూ.28వేల నుంచి రూ.30వేల మధ్య పలుకుతోంది. వ్యాపారులకు సూట్ రూపంలో రెండు టన్నులు, ఏరివేత క్రమంలో పది టన్నులకు మరో టన్ను కాయలు పోతాయంటున్నారు. అంటే పది టన్నులకు ఏడు టన్నులకే ధర దక్కుతుంది. ప్రస్తుత ధరలతో రైతులకు ఏకోశానా గిట్టుబాటయ్యే పరిస్థితి లేదంటున్నారు. కనీసం టన్ను రూ.40వేలు పలికితే రైతులకు లాభం చేకూరే వీలుంటుందంటున్నారు. బయటి వ్యాపారులు రాకపోవడంతో ధర పెరగలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. స్థానిక వ్యాపారులు సిండికేట్ అయి ధర నిర్ణయించి, కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా బయటి వ్యాపారులతో మరో రేటు మాట్లాడుకుని పంపుతున్నారన్న వాదనలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇతర ప్రాంత వ్యాపారులు వస్తే రైతులకు కొంత మేలు చేకూరే అవకాశం ఉందంటున్నారు.

దిగుబడి బాగుంది..

అనంతపురం రూరల్ మండలం ఎనిమిదెకరాల్లో చీనీ సాగు చేశా. గతంలో కంటే ప్రస్తుతం దిగుబడి బాగుంది. గత ఏడాది చెట్టుకు 60 కేజీల వరకు దిగుబడి వచ్చింది. ఈసారి 80కేజీలకుపైగానే వచ్చింది. గిట్టుబాటు ధర దక్కితే రైతులకు లాభం వస్తుంది. ప్రస్తుత ధరతో గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. ధర పెరిగితే బాగుంటుంది. కనీసం టన్ను రూ.40వేలతో అమ్ముడుపోతే రైతులకు లాభం చేకూరుతుంది.

- త్రిలోక్‌నాయుడు, రైతు, మన్నీల

ధర చూసి భయమేస్తోంది..



గతేడాది పంట సాగుకు ఇబ్బందులు పడ్డాం. పెట్టుబడులు పెట్టినా నీటి సమస్యతో కష్టపడ్డాం. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత బాగుండటంతో ఆ కష్టాలు తప్పాయి. దిగుబడులు కొంత వరకు బాగానే ఉన్నాయి. ఈ ఏటా పెట్టుబడులకే రూ.10లక్షలకుపైగా ఖర్చయింది. ప్రస్తుత ధర చూస్తే భయమేస్తోంది. టన్ను రూ.30వేలు కూడా పలకడం లేదు. ఇలా అయితే రైతుకు నష్టమే. ధర చూసి రైతులు కాయలు కూడా కోయడం లేదు. సీజన్ ఇంకా ఉండటంతో మంచి ధర వస్తుందని ఆశిస్తున్నాం. మంచి ధర వస్తే కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుంది.

- నరసింహారెడ్డి, రైతు, ముకుందాపురం

రెండు నెలల కిందటే ముగిసిన డీఎస్సీ కోచింగ్

నగదు ప్రోత్సాహమేదీ?



బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయం



ఉచిత డీఎస్సీ కోచింగ్‌కు హాజరైన అభ్యర్థులు(ఫైల్)

జాబితా పంపిన జిల్లా అధికారులు

అభ్యర్థులకు తప్పని ఎదురుచూపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): బీసీ స్టడీ సర్కిల్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీకి ఉచితంగా శిక్షణ ఇచ్చారు. అందులో భాగంగానే అనంతపురం జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్లో ఉచిత శిక్షణకు నోటిఫికేషన్ విడుదల చేసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గత నవంబరు 16న డీఎస్సీ ఉచిత శిక్షణను మొదలుపెట్టి జనవరి 31వ తేదీతో ముగించారు. అభ్యర్థులకు శిక్షణా కాలంలో మెటీరియల్, ఉపకార వేతనం చెల్లిస్తామన్న హామీ అలాగే మిగిలిపోయింది. శిక్షణ ముగిసి రెండునెలలు పూర్తయినా రాష్ట్రస్థాయి అధికారుల నుంచి నగదు అందించే విషయంలో ఎలాంటి స్పందన కనిపించలేదు. బీసీ స్టడీ సర్కిల్ జిల్లా అధికారులను ఆరా తీస్తే... వివ రా లను రాష్ట్రశాఖకు పంపాం. అక్కడి నుంచి నిధులు విడుదల చేస్తే.. అభ్యర్థుల ఖాతాలకు జమ అవుతుందని చెప్పుకొస్తున్నారు.

మెటీరియల్, నగదు ఏదీ..?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి దాదాపు 210 మంది అభ్యర్థులు శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారు. అందులో 140 మంది ఉచిత శిక్షణకు ఎంపికయ్యారు. మధ్యలోనే 47 మంది శిక్షణకు గైర్హాజరయ్యారు. శిక్షణ ముగిసే సమయానికి 93 మంది అభ్యర్థులు ఉన్నారు. ఇప్పటికే అభ్యర్థులు వారి బ్యాంకు ఖాతా వివరాలను స్టడీ సర్కిల్ అధికారులకు అందజేశారు. వీరందరికి శిక్షణ దరఖాస్తులు తీసుకునే సమయంలోనే మెటీరియల్‌కు రూ. 1000, శిక్షణ కాలానికి నెలకు రూ. 1500 చొప్పున రెండు నెలలకు రూ. 3000 ఉపకార వేతనం చెల్లిస్తామని ప్రకటించారు. ఇప్పటికి వరకూ అభ్యర్థులకు సొమ్ము జమకాలేదు.

శిక్షకులదీ అదే పరిస్థితి...

బీసీ స్టడీ సర్కిల్లో డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు బీసీ స్టడీ సర్కిల్ అధికారులు సెషన్ల వారీగా దాదాపు 15 మందికిపైగా శిక్షకులను నియమించారు. వారు సబ్జెక్టుల వారిగా శిక్షణ ఇచ్చారు. సెషన్(ఒకటిన్నర గంట) చొప్పున రోజుకు 5 సెషన్ల పాటు అభ్యర్థులకు శిక్షణ అందించారు. వారికి ఇంత వరకూ నగదు జమచేయలేదు. వారు తమ బ్యాంకు ఖాతా వివరాలు స్టడీ సర్కిల్‌కు అందించారు.

వివరాలను రాష్ట్రశాఖకు పంపాం

బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందించిన డీఎస్సీ ఉచిత శిక్షణ మెటీరియల్, ఉపకార వేతనాలకు సంబంధించిన అభ్యర్థుల వివరాలను రాష్ట్ర అధికారులకు పంపాం. ఇంకా కొంత మంది అభ్యర్థుల నుంచి వివరాలు అందాల్సిన ఉంది. రాష్ట్రశాఖ నుంచి ఫండ్ రిలీజ్ అయితే... నేరుగా అభ్యర్థుల ఖాతాకు నగదు జమవుతుంది. ఈ విషయంలో అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.



- సుమన జయంతి, డైరెక్టర్, బీసీ స్టడీ సర్కిల్



570 మార్కులు సాధిస్తే..

విమానం ఎక్కిస్తా

పదో తరగతి విద్యార్థులకు ఎంఈఓ బంపర్ ఆఫర్

● సొంత మండలంలో విద్యాభివృద్ధికి కృషి ● పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలల అభివృద్ధి

బెళుగుప్ప, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'రేయ్.. పిల్లలూ..! బాగా చదవండి. మంచి మార్కులు తెచ్చుకోండి. పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకుంటే మిమ్మల్ని విమానం ఎక్కిస్తా'. ఈ మాటలు ఏ తండ్రో తన పిల్లలకు చెప్పినవి కావు. ఓ ఎంఈఓ తన మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇచ్చిన బంపర్ ఆఫర్. ఇలాంటి వాటితో విద్యార్థుల్లో స్ఫూర్తిని రగిలిస్తూ తన సొంత మండలం బెళుగుప్పలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు మండల విద్యాధికారి పాటిల్ మల్లారెడ్డి.

టీచర్ నుంచి ఎంఈఓగా..

పాటిల్ మల్లారెడ్డి స్వగ్రామం బెళుగుప్ప మండలంలోని ఎర్రగుడి. తండ్రి వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి. తల్లి సుశీలమ్మ. ఈయన బెళుగుప్ప ఉన్నత పాఠశాలలో పదో తరగతి (1978-79) వరకు చదువుకున్నారు. ఎర్రగుడి నుంచి బెళుగుప్పకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రతి రోజు రెండు కిలోమీటర్లు కాలినడకన పాఠశాలకు వచ్చేవారు. ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేసి 1989లో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2023జూలైలో సొంత మండలానికి ఎంఈవోగా వచ్చారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ

చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చర్యలు

చదివిన పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఎంఈఓ మల్లారెడ్డి పూర్వ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. బెళుగుప్ప పాఠశాలలో చదివి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు తెచ్చుకున్న వారికి, బాగా స్థిరపడిన వారికి పాఠశాలకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు వెంకట ప్రసాద్ రాజశేఖర్ సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే పూర్వ విద్యార్థుల సహకారంతో పాఠశాలకు ప్రధాన ద్వారం, క్రీడలు ఆడేందుకు వివిధ రకాల కోర్టులు, సరస్వతి, గణపతి విగ్రహాల ఏర్పాటు, సమావేశ వేదిక నిర్మాణం, కంప్యూటర్లు, ప్రింటింగ్, స్కానింగ్ మిషనరీ, కుర్చీలు సమకూర్చారు.

విమానమెక్కిస్తా

తన సొంత మండల విద్యార్థులను పదో తరగతిలో జిల్లా టాపర్లుగా నిలపడానికి మల్లారెడ్డి పట్టుద లగా ప ని చేస్తున్నా రు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో 570 మార్కులు సాధిస్తే సొంత ఖర్చులతో బెంగళూరు నుంచి హైదరాబాదు వరకు విమానంలో తీసుకెళ్తానని బంపర్ ఆఫర్ ఇచ్చారు. బెళుగుప్ప టీడీపీ నాయకుడు పెద్ద తిప్పయ్య సహకారంతో మండలంలో పదో తరగతి విద్యార్థులందరికీ స్టడీ మెటీరియల్ అందజేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారు. ఇలా మండల విద్యాభివృద్ధికి మల్లారెడ్డి నిర్విరామంగా కృషి చేస్తూ, బాధ్యత మరువని బడి పంతులుగా మన్నన పొందుతున్నారు.





పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్మించిన సరస్వతి నిలయం, ఎంఈఓ పాటిల్ మల్లారెడ్డి

ఔత్సాహికులకు ప్రోత్సాహం..!

● పరిశ్రమలకు రాయితీలు పెంచుతూ ఉత్తర్వులు ● త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ● స్వాగతిస్తున్న పారిశ్రామిక ఔత్సాహికులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించే పారిశ్రామిక ఔత్సాహికులకు రాష్ట్ర ప్రభుత్వం మరింత ప్రోత్సాహాన్ని అందించనుంది. నూతన ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలోని 2023-2027 పాలసీని రద్దు చేసి, 2024- 2029 కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీని తీసుకు వచ్చింది. తాజాగా పరిశ్రమల స్థాపనకు రాయితీలు ఖరారు చేయడంతోపాటు అమలుకు సంబంధించిన విధివిధానాలతో ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఎన్నడూలేని విధంగా పెట్టుబడి రాయితీని పెంచింది. త్వరలోనే కొత్త పరిశ్రమల స్థాపనకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. పరిశ్రమల యూనిట్ విలువతోపాటు రాయితీలు పెంచడంపై ఔత్సాహికులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

స్పెషల్ కేటగిరిలో..

స్పెషల్ కేటగిరి కింద మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, హిజ్రాలకు ఉత్పత్తి, సేవా రంగం, సూక్ష్మ పరిశమ్రల స్థాపనకు 45 శాతం పెట్టుబడి రాయితీ వర్తింపజేసింది. రూ.2.50 కోట్ల వరకు యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను సూక్ష్మ పరిశ్రమల కేటగిరిలోకి చేర్చారు. గతంలో రూ.కోటి దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను సూక్ష్మపరిశ్రమలుగా భావించేవారు. రెండు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. సూక్ష్మ పరిశ్రమలకు రూ.45 లక్షల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. చిన్న పరిశ్రమలకు 45 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. రూ.25 కోట్ల దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా పరిగణిస్తారు. గతంలో రూ.10 కోట్ల దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా భావించేవారు. మూడు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. రూ.4.50 కోట్ల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. మధ్యతరహా పరిశ్రమలకు 35 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. రూ.125 కోట్ల దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలు మధ్యతరహా కిందకు వస్తాయి. గతంలో రూ.50 కోట్ల దాకా యూనిట్ విలువ కలిగిన పరిశ్రమలను మధ్యతరహా పరిశ్రమగా భావించేవారు. రూ.7 కోట్లకు సబ్సిడీ సీలింగ్ విధించారు. నాలుగు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు.

ట్రాన్స్‌పోర్టు సర్వీస్..

ట్రాన్స్‌పోర్టు సర్వీస్ కేటగిరిలో ఎస్సీఎస్టీలకు సూక్ష్మ పరిశ్రమల కింద 45 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.45 లక్షలు సీలింగ్ విధించారు. రెండు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. చిన్న పరిశ్రమల కింద 45 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.75 లక్షలు సబ్సిడీ సీలింగ్ విధించారు. రెండు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. మధ్యతరహా పరిశ్రమల కింద 35 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.75 లక్షల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. నాలుగు విడతల్లో సబ్సిడీ సొమ్ము జమ చేస్తారు.

విద్యుత్ సబ్సిడీ..

జనరల్ కేటగిరిలో యూనిట్‌కు ఒక్క రూపాయి విద్యుత్ సబ్సిడీ వర్తింపజేస్తారు. స్పెషల్ కేటగిరిలో సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు యూనిట్‌కు రూ.1.50, మధ్యతరహా పరిశ్రమలకు యూనిట్‌కు ఒక్క రూపాయి సబ్సిడీ వర్తింపజేస్తారు. అన్ని కేటగిరిల పరిశ్రమలకు అమ్మకపు పన్ను (ఎస్‌జీఎస్టీ)పైనా సబ్సిడీ వర్తింపజేయాలని నిర్ణయించారు.



పరిశ్రమల శాఖ జిల్లా కార్యాలయం

వైసీపీ హయాంలో అరకొరే..

వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక ఔత్సాహికులకు అరకొరగానే సబ్సిడీని వర్తింపజేశారు. అప్పట్లో 2023-27 పాలసీ కింద ఉత్పత్తి, సేవా రంగం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు 15 శాతం సబ్సిడీని మాత్రమే వర్తింపజేశారు. రూ.20 లక్షల సబ్సిడీ సీలింగ్ విధించారు. ఇందులో మహిళలకు రూ.30 లక్షలు సబ్సిడీ సీలింగ్ విధించారు. ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఉత్పత్తి, సేవా రంగాలకు రూ.1.20 కోట్లు, ట్రాన్స్‌పోర్టుకు రూ.75 లక్షలు దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. విద్యుత్ సబ్సిడీ కింద సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు యూనిట్‌కు ఒక్కరూపాయి, ఎస్సీఎస్టీలకు యూనిట్‌కు రూ.1.50 వర్తింపజేశారు. సబ్సిడీ తక్కువగా ఉండడంతో పారిశ్రామిక ఔత్సాహికులు పెద్దగా దరఖాస్తు చేసుకోలేదు.

జనరల్ కేటగిరి..

జనరల్ కేటగిరి (ఓసీ పురుషులు) కింద ఉత్పత్తి, సేవా రంగం సూక్ష్మ పరిశ్రమలకు 25 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.25 లక్షలకు సబ్సిడీ సీలింగ్ విధించారు. రెండు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. చిన్న పరిశ్రమలకు 25 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.1.50 కోట్ల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. మూడు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు. మధ్యతరహా పరిశ్రమలకు 25 శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. రూ.7 కోట్ల దాకా సబ్సిడీ సీలింగ్ విధించారు. నాలుగు విడతల్లో సబ్సిడీ సొమ్మును జమ చేస్తారు.

త్వరలో దరఖాస్తుల స్వీకరణ

2024- 2029 పారిశ్రామికాభివృద్ధి పాలసీకి సంబంధించి ప్రభుత్వం జీవోతోపాటు విధివిధానాలను విడుదల చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పెట్టుబడి రాయితీని నిర్ణయించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు త్వరలోనే అవకాశం కల్పించనుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే పారిశ్రామిక ఔత్సాహికుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ నిబంధనల మేరకు పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.



-శ్రీనివాసయాదవ్, జీఎం, పరిశ్రమల శాఖ

గుంతలకు గుడ్ బై!

జాతీయ రహదారుల మరమ్మతులకు గ్రీన్ సిగ్నల్




గుంతకల్లు వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు (ఫైల్)

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై వాహనదారులకు గుంతల తిప్పలు తప్పనున్నాయి. మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే కొన్నిచోట్ల పనులు కూడా మొదలయ్యాయి. మరికొన్ని చోట్ల ప్రారంభించాల్సి ఉంది. స్వల్పకాలిక నిర్వహణ కింద అధికారులు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 67వ జాతీయ రహదారిపై జిల్లాలోని గడేకల్లు, గుంతకల్లు, డోనేకల్లు ప్రాంతాల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటి మరమ్మతులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. పనులు కూడా పూర్తి చేశారు. అదే తరహాలో ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల మరమ్మతులకు పెద్దఎత్తున శ్రీకారం చుట్టారు.

పండమేరు బ్రిడ్జి మరమ్మతులకు..

అనంతపురం నగర పరిధిలోని పండమేరు బ్రిడ్జి మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతంలో కురిసిన వర్షాలకు పండమేరుకు భారీ వరద వచ్చింది. ఆ నీటి ప్రవాహం కారణంగా పండమేరు బ్రిడ్జి కింది భాగంలో దెబ్బతింది. దీనిని గుర్తించిన జాతీయ రహదారుల అధికారులు ఆర్డీటీ స్టేడియం వద్ద ఉన్న పండమేరు పాత బ్రిడ్జి మీద వాహన రాకపోకలు నిలిపివేశారు. నూతన బ్రిడ్జిపైనే రాకపోకలు సాగించేలా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో బ్రిడ్జి మరమ్మతులకు స్థానిక అధికారులు నివేదిక పంపారు. అందుకు ఉన్నతాధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మరమ్మతులు చేపట్టేలా సంకేతాలు వచ్చాయి. మరో రెండు రోజుల్లో ఉత్తర్వులు రానున్నట్లు అధికార యంత్రాంగం చెప్పుకొస్తోంది. వీలైనంత త్వరలో మరమ్మతులు ప్రారంభించే అవకాశం ఉంది.



రోడ్డు మరమ్మతుల తరువాత ఇలా..

ముదిగుబ్బ-కదిరి ఫోర్ లేన్‌కు ఓకే..

శ్రీసత్యసాయి జిల్లాలో 42వ నంబరు జాతీయ రహదారిపై ముదిగుబ్బ, కదిరి మధ్య ప్రస్తుతం డబుల్ లేన్ రోడ్డు ఉంది. 22 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే ఆమోదం లభించనున్నట్లు తెలిసింది. అదే రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించేందుకు రూ.427.26 కోట్లతో ప్రతిపాదనలు పంపగా.. అనుమతులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు చేపట్టనున్నారు.

ముదిగుబ్బలో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి..

ముదిగుబ్బలో ఇంటర్నల్ రోడ్ల నిర్మాణానికి రూ.21.97 కోట్లు మంజూరయ్యాయి. బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇంటర్నల్ రోడ్లు గుంతలమయమయ్యాయి. బైపాస్‌రోడ్డు నుంచి మండల కేంద్రం మీదుగా తిరిగి బైపాస్ వరకు ఇంటర్నల్ రోడ్డు నిర్మించనున్నారు. ఇదే తరహాలో మడకశిరలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా.. పూర్తి కావచ్చాయి.

పనులు వేగవంతం చేస్తాం

జాతీయ రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గడేకల్లు, గుంతకల్లు, డోనేకల్లు ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతులు చేపట్టాం. మరికొన్ని పనులకు ప్రతిపాదనలు పంపాం. ఆమోదం లభించిన పనులను వేగవంతం చేస్తాం.

- సుధాకర్‌రెడ్డి, జాతీయ రహదారుల ఈఈ

మీ బట్టలు ఊడదీస్తాం

(5వ పేజీ తరువాయి)

ఇద్దరి పేర్లను మాత్రమే కేసులో చేర్చారని అన్నారు. ఈ దాడిని ప్రోత్సహించిన, దాడి చేసిన వారిపై కేసులు లేకుండా చేశారని అన్నారు.

పబ్లిసిటీ స్టంట్

జగన్ పర్యటనను వైసీపీ పబ్లిసిటీ స్టంట్‌గా మార్చుకుంది. కుంటిమద్ది సమీపంలో హెలిప్యాడ్ వద్దకు జగన్ రాకముందే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ తమ అనుచరులతో అక్కడికి వచ్చి హల్‌చల్ చేశారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించి, డ్రోన్ కెమరాతో మరీ వీడియో తీయించారు. ఈ క్రమంలో పోలీసులు వారిస్తున్నా వినకుండా వైసీపీ కార్యకర్తలు భారీగా హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నాయి. జగన్ రాగానే దిగేందుకు వీల్లేకుండా హెలిక్యాప్టర్‌ను చుట్టుముట్టారు. పోలీసులను తోసుకుంటూ, వారితో గొడవపడుతూ రభస చేశారు.

పోలీసులతో వాగ్వాదం

చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ఎస్ గేటు వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను తనిఖీ చేసిన తరువాత పాపిరెడ్డిపల్లి మార్గం వైపు అనుమతించారు. ఈ క్రమంలో నాలుగు రోడ్ల కూడలిలో వాహనాలు నిలిచిపోయి జనం ఇబ్బందిపడ్డారు. అనుమతి లేని వాహనాలను పోలీసులు అడ్డుకోవడంతో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. అన్ని వాహనాలను వదిలేవరకూ ఆయన వినుకోలేదు.

బ్యారికేడ్లను తోసుకుని వస్తున్న వైసీపీ శ్రేణులు



చావు ఇంటికి వచ్చి జేజేలా..!

జగన్ వ్యాఖ్యలపై పోలీసులు స్పందించాలి

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): చావు ఇంటికి పరామర్శకు వచ్చి, వెకిలి నవ్వులు నవ్వుతూ జేజేలు కొట్టించుకున్నారని మాజీ సీఎం జగన్‌పై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శలు గుప్పించారు. ఒక బీసీ కుటుంబాన్ని పులివెందుల ఎమ్మెల్యే, ఆయన పార్టీ నేతలు అవమానించారని అన్నారు. అసమర్థుడు, చేతగాని దద్దమ్మ ప్రకాశ్ రెడ్డి మాటలు విని జగన్ రెడ్డి ఇక్కడికి వచ్చి పచ్చి అబద్ధాలు చెప్పి వెళ్లారని అన్నారు. గ్రామంలో ఏం జరిగిందో తెలుసుకోకుండా ప్రకాశ్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ చదివేందుకు వచ్చారని అన్నారు. కర్రలతో దాడి జరిగితే కొడవళ్లు, రాళ్లు, రాడ్లు అంటూ జగన్ పచ్చి అబద్ధాలు చెప్పారని అన్నారు. అలాంటి ఆయుధాలను పులివెందులలో బాత్‌రూంలో చంపడానికి ఉపయోగిస్తారని ఎద్దేవా చేశారు. పాపిరెడ్డిపల్లి ఘటన వైసీపీ నేతలకంటే తమకే ఎక్కువ బాధ కలిగించిందని అన్నారు. జగన్ రెడ్డి తనను, తన కుమారుడిని టార్గెట్ చేయడానికి వచ్చారని ఆరోపించారు. 'నీ సొంత చిన్నాన్నను చంపితే.. న్యాయం చేయాలని మీ చెల్లెలు వేడుకున్నా పట్టించుకోలేదు. తల్లికి, చెల్లెళ్లకు న్యాయం చేయలేని నీవు లింగమయ్య కుటుంబానికి ఏ న్యాయం చేస్తావు..?' అని జగన్‌ను ప్రశ్నించారు. గతంలో పరిటాల రవీంద్ర పులివెందులకు వెళితే అడ్డుకున్నారని, అయినా తాము ఇక్కడ అడ్డుకునే ప్రయత్నం చేయలేదని అన్నారు. జిల్లాలో ఉన్న మాజీ ఎమ్మెల్యేలను పాపిరెడ్డిపల్లికి పిలిపించి సెల్ఫీలు దిగారని, షో చేశారని విమర్శించారు. దుఃఖంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఎలా పరామర్శించాలో తెలియదా అని నిలదీశారు. లింగమయ్య కుటుంబానికి ఏం న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అంత బలం ఉంటే ఎంపీపీ ఎన్నికను ఎందుకు గెలవలేదో ఒక్కసారి ఆలోచించుకోవాలని సూచించారు. ఎన్నిక ముందురోజు నుంచే గొడవలు పెట్టాలని ప్రకాశ్‌రెడ్డి చూశారని, బీసీ నేతలను రామగిరికి పంపి గొడవలు సృష్టించారని ఆరోపించారు. ఎంపీటీసీల మీద నమ్మకం ఉంటే ఎన్నికలకు హాజరు కాకుండా రామేశ్వరం ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నించారు. ఎస్ఐ సుధాకర్ యాదవ్ గురించి చేస్తున్న వ్యాఖ్యలు నీ స్థాయికి తగునా అని జగన్‌ను నిలదీశారు. ఎస్ఐను దూషిస్తూ నీచంగా మాట్లాడటం సరైంది కాదని అన్నారు. సుధాకర్ యాదవ్ ఎంపీటీసీలతో తమకు ఫోన్‌లో మాట్లాడించారని బైబిల్‌పై ప్రమాణం చేయగలవా? నేను భగవద్గీతపై ప్రమాణం చేసి లేదని చెప్పగలను అని అన్నారు. పోలీసులు ఎక్కడా అడ్డుకోకపోయినా అడ్డుకున్నట్లు జగన్ ప్రచారం చేసుకున్నారని, కానీ పోలీసులు ఆయనకు రెడ్ కార్పెట్ స్వాగతం పలికారని పరిటాల సునీత అన్నారు. ప్రతిపక్షంలో తాము ఉన్నప్పుడు పోలీసుల ద్వారా ఎన్ని ఇబ్బందులు పెట్టారో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. కానీ తాము పోలీసుల పట్ల ఎన్నడూ దురుసుగా ప్రవర్తించలేదని అన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రి అయ్యుండి.. పోలీసుల గుడ్డలు ఊడదీస్తానని మాట్లాడటం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. పెనుకొండలో ప్రకాశ్ రెడ్డి పోలీసులను పచ్చి బూతులు తిట్టినా పోలీసులు నామమాత్రంగా కూడా స్పందించలేదని అన్నారు. ఎస్పీ రత్న ఎందుకు స్పందించలేదో అర్థంకావడంలేదని అన్నారు. పోలీసులను ఎంత కించపరచినా మాట్లాడకపోతే ప్రజల్లోకి వేరేవిధంగా వెళుతుందని అన్నారు. జగన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎస్పీతోపాటు పోలీసులంతా స్పందించాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

బండ్లు పెట్టాం.. డబ్బులు ఇస్తాం..!

పామిడి: పాపిరెడ్డిపల్లి పర్యటనకు వైఎస్ జగన్ వస్తున్నారని, ఆయన పర్యటనలో పాల్గొంటే డబ్బులు ఇస్తామని వైసీపీ నాయకులు ప్రచారం చేశారు. 'రండి.. బండు పెట్టాం.. డబ్బులు ఇస్తాం..' అని పామిడి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై జనాన్ని పిలిచారు. అంబేడ్కర్ కాలనీ వద్ద వైసీపీ టౌన్ కన్వీనర్ నగూరు ఈశ్వర్‌రెడ్డి డబ్బులు లెక్కిస్తూ, పంచిపెట్టే వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



పామిడిలో డబ్బులు పంచుతున్న వైసీపీ టౌన్ కన్వీనర్ నగూరు ఈశ్వర్‌రెడ్డి

విభజన బిల్లును రద్దు చేయండి

ఆలిండియా రిటైర్డు రైల్వేమెన్స్ ఫెడరేషన్



ధర్నా నిర్వహిస్తున్న ఏఐఆర్ఆర్ఎఫ్ నాయకులు

గుంతకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లను రెండుగా విభజిస్తూ పార్లమెంటులో తెచ్చిన బిల్లును వెంటనే రద్దు చేయాలని ఆలిండియా రిటైర్డు రైల్వేమెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఆర్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే విశ్రాంత ఉద్యోగులు మంగళవారం ఉదయం డీఆర్ఎం కార్యాలయం వద్దకు ర్యాలీగా తరలివచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఆర్ఆర్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు జీ జయంత్ కుమార్, వీ సుంకప్ప మాట్లాడుతూ మార్చి 23న పార్లమెంటులో పాత పెన్షనర్లు, కొత్త పెన్షనర్లు అంటూ వేరుచేస్తూ నిబంధనలను సవరించారన్నారు. దీని వల్ల 8వ కేంద్ర సీపీసీలో ఓల్డ్ పెన్షనర్లకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. 6, 7 సీపీసీలలో మాదిరిగానే పెన్షనర్లందరికీ లబ్ధి చేకూరేలా కొత్త నిబంధనలను రద్దు చేయాలన్నారు. రిటైర్మెంటు తేదీతో సంబంధం లేకుండా, వ్యాలిడేషన్ సాకు పెట్టకుండా పాత నిబంధనలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఆర్ఎంకు వినతిపత్రాన్ని అందజేశారు.

అశ్రునయనాల మధ్య ఎస్‌డీసీ అంత్యక్రియలు

నివాళులు అర్పించిన కడప, అనంతపురం అధికారులు



నివాళులు అర్పిస్తున్న కడప స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణారెడ్డి

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) రమాదేవి (56) అంత్యక్రియలను మంగళవారం కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో అశ్రునయనాల మధ్య నిర్వహించారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రమాదేవి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆమె పుట్టినిల్లు కంబదూరు మండలం కొత్తపల్లి. మెట్టినిల్లు కూడా ఇదే మండలంలోని తిమ్మాపురం గ్రామం. మంగళవారం ఉదయం తిమ్మాపురానికి భౌతికకాయాన్ని తీసుకువచ్చారు. దీంతో అనంతపురం, కడప రెవెన్యూ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతపురం డీఆర్వో మలోలా, కడప డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, కడప డిప్యూటి కలెక్టర్లు నీలిమయ్య, తిప్పేనాయక్, రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు, కంబదూరు తహసీల్దారు బాలకిషన్, ఆర్ఐలు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రమాదేవి భర్త రాజేంద్రనాయక్ ఎస్ఐగా ఉద్యోగ విరమణ చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

అనంతపురంరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశానికి నిర్వహించే బీఆర్ఏజీ సెట్‌కు సంబంధించిన హాల్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కురుగుంట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి మంగళవారం ప్రకటనలో కోరారు. ఈనెల 13న ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించిన ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

జూన్‌కి హంద్రీనీవా పనులు పూర్తి

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



హంద్రీనీవా కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను జూన్ పదో తేదీకీ పూర్తి చేసి, 3,850 క్యూసెక్కుల నీటిని పారిస్తామని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. గుంతకల్లుకు మంగళవారం ఉదయం వచ్చిన మంత్రి స్థానిక రైల్వే కోజీ గెస్టు హౌస్‌లో బస చేశారు. ఆయన్ను స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు మంత్రిని కలిసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే జయరాం పలు అంశాలపై మంత్రితో చర్చించి, వినతిపత్రాన్ని అందజేశారు. వజ్రకరూరు మండలం రాగులపాడు సమీపంలో హంద్రీనీవా 174 కి.మీ.ల వద్ద నుంచి లింకు కాలువను తవ్వి గుంతకల్లు నియోజక వర్గంలోని 12 చెరువులకు నీటిని అందించాలని కోరారు. గుంతకల్లు మండలంలోని వైటీ చెరువు నుంచి గుత్తి చెరువుకు లింక్ కాలువ నిర్మాణానికి రూ. రెండు కోట్ల కేటాయింపు జరగాల్సి ఉందని, హంద్రీ నీవాకు నీరు వచ్చిన న్నాళ్లూ జీఎస్‌బీసీకి 200 క్యూసెక్కుల నీటిని కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలోని చెరువుల మరమ్మతులకు రూ.18 కోట్లను కేటాయించాలని, గుంతకల్లు పట్టణానికి తాగునీటి అవసరాలకు హంద్రీనీవా నుంచి అధికారికంగా నీటిని కేటాయించాలని, తదితర అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం జీ కొట్టాల వద్ద హంద్రీనీవా కాలువలో జరుగుతున్న వైడెనింగ్ పనులను మంత్రి, ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ, గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

జీజీహెచ్‌లో ఆర్‌ఓ ప్లాంట్, తల్లిపాల నిధి, ధన్వంతరి సమావేశ మందిరం ప్రారంభం



తల్లిపాల నిధిని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఆర్‌ఓ ప్లాంట్, తల్లిపాల నిధి, ధన్వంతరి సమావేశ మందిరాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఆయన మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయలసీమలోనే కర్నూలు తరువాత ఎక్కువ మంది రోగులు వచ్చేది అనంతపురం పెద్దాసుపత్రికే అని తెలిపారు. జీజీహెచ్‌లో ఉన్న అనేక సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎన్టీఆర్ వైద్య సేవలు నిలిచిపోలేదని, నిరాటకంగా సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు పెండింగ్ పెట్టిన రూ.3వేల కోట్ల బిల్లులను తమ ప్రభుత్వం చెల్లించిందన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సూపర్ స్పెషలిస్టులు, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది నియామకాలు త్వరలో పూర్తి చేస్తామని వివరించారు. తల్లిపాల విశిష్టతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు.

దాతల సేవలు అభినందనీయం: ఎంపీ

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ముందుకు వస్తున్న దాతల సేవలు అభినందనీయమన్నారు. త్వరలో ఆసుపత్రిలో రోగులు, బంధువులకు ఉచిత వసతి కల్పించేందుకు అనువుగా విశ్రాంతి గదులు నిర్మిస్తామని తెలిపారు. ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసిన సప్తగిరి క్యాంపర్, రూ.40లక్షలతో ధన్వంతరి హాల్‌ను నిర్మించిన తాడిపత్రి ఆర్జస్ స్టీల్ యాజమాన్యాన్ని సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు, మెడికల్ ఎడ్యుకేషన్ అడిషినల్ డైరెక్టర్ రఘునందన్, ఏఓ మల్లికార్జున రెడ్డి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, డీఎంహెచ్ఓ ఈబీదేవి, వైద్య కళాశాలప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, ఆర్ఎంఓ మాధవి, ప్రొఫెసర్లు, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుజిరీ వ్యాపారి మృతి

కనగానపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్తాపురం జంక్షన్ వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని గుజిరీ వ్యాపారి సిరాజ్ (35) దుర్మరణంచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సోమందేపల్లికి చెందిన సిరాజ్ గుజిరీ వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడికి భార్య అమరాన్‌తాజ్‌తోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యాపారంలో భాగంగా ముక్తాపురానికి వచ్చిన సిరాజ్ రాత్రికి సొంత ఆటోలో గుజిరీ సామగ్రి వేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. ముక్తాపురం జంక్షన్‌లో ఆటో ఆపి, నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా.. గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టి, వెళ్లిపోయింది. దీంతో సిరాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదంపై కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

ఎనుములవారిపల్లి వద్ద వీఆర్‌ఏ..

ముదిగుబ్బ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనుములవారిపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. నల్లమాడ మండలం రెడ్డిపల్లి వీఆర్‌ఏ ప్రసాద్(38) అనంతపురంలో ఉన్న భార్య, పిల్లల వద్దకు వెళ్లి మంగళవారం ద్విచక్ర వాహనంపై రెడ్డిపల్లికి విధులకు బయల్దేరాడు. ఎనుములవారిపల్లి సమీపంలోకి రాగానే గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చేసే బొలెరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వీఆర్‌ఏ అక్కడికక్కడే మృతి చెందాడు. పట్నం పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఇంటర్వ్యూలకు 14 మంది హాజరు

అనంతపురం విద్య, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఐసీడీఎస్ పరిధిలోని పలు పోస్టులకు మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 14 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు చేశారు. స్టోర్ కీపర్ కం అకౌంటెంట్‌కు 8 మంది, హౌస్ కీపర్, ఎడ్యుకేటర్, మ్యూజిక్ టీచర్ పోస్టులకు ఒకరు చొప్పున, పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ పోస్టుకు ముగ్గురు హాజరయ్యారు.

మహిళ ఆత్మహత్య

గోరంట్ల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టగుండ్లపల్లికి చెందిన సరస్వతి (30) మంగళవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. చెన్నేకొత్తపల్లి మండల వాసి సరస్వతికి పుట్టగుండ్లపల్లికి చెందిన చేనేత కార్మికుడు విశ్వనాథ్‌తో వివాహమైంది. వారికి కుమార్తెలు సిరి, శ్రీగుణ, కుమారుడు పార్థు ఉన్నారు. విశ్వనాథ్.. భార్య సరస్వతిని వేధించడంతోపాటు తరచూ కొట్టేవాడని ఆమె తల్లి వడ్డె చంద్రమ్మ తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం గదిలోకెళ్లి సరస్వతి ఉరేసుకుంది. వెంటనే గర్తించిన కుటుంబీకులు తలుపులు బద్దలుకొట్టి, ఆమెను గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా.. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో కుంటుసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.



సరస్వతి మృతదేహం

భర్తతో గొడవపడి మరో మహిళ...

కనగానపల్లి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లిలో సోమవారం రాత్రి నీలమ్మ(28) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామగిరి మండలానికి చెందిన నీలమ్మకు మామిళ్లపల్లి వాసి మురళితో వివాహమైంది. వారికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ సమస్యలతో సోమవారం సాయంత్రం దంపతులు గొడవ పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన నీలమ్మ రాత్రికి ఇంట్లోని ఓ గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని, ఆత్మహత్యకు పాల్పడింది. మంగళవారం ఉదయం కుటుంబసభ్యులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, పరిశీలించారు. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నీలమ్మ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.



నీలమ్మ మృతదేహం

ఊడదీసేందుకు ఇదేమైనా అరటి తొక్కనా..?

రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్



పుట్టపర్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): 'జగన్.. పోలీసుల బట్టలు ఊడదీస్తానంటున్నావ్.. అవేమన్నా నీవిచ్చిన బట్టలనుకుంటున్నావా..? మేం కష్టపడి సంపాదించుకున్నవి' అని రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ అన్నారు. పాపిరెడ్డిపల్లిలో మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందిస్తూ, సోషల్ మీడియాలో మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. తాము కష్టపడి చదువుకుని, రన్నింగ్ రేస్‌లో వేలాది మందితో పోటీపడి పోలీసు ఉద్యోగాన్ని సంపాదించుకున్నామని అన్నారు. 'నువ్వెవడో వచ్చి ఊడదీయడానికి ఇదేమీ అరటి తొక్క కాదు..' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ప్రజల పక్షాన నిజాయితీగా నిలబడతామని, నిజాయితీగానే ఉద్యోగం చేస్తామని, నిజాయితీగానే చస్తామని అన్నారు. అడ్డమైన దారులను తాము తొక్కమని, జాగ్రత్తగా మాట్లాడాలని జగన్‌ను హెచ్చరించారు.

వేసవిలో వీక్లీ రైళ్లు

గుంతకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి గుంతకల్లు మీదుగా కొన్ని వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ-వారాణసి ప్రత్యేక వీక్లీ రైలు (నం. 07323) ఇప్పటి నుంచి మే 10వ తేదీ వరకూ ప్రతి శనివారం, దీని తిరుగు ప్రయాణపు రైలును ఈ నెల 8వ తేదీ నుంచి మే 13వ తేదీ వరకూ ప్రతి మంగళవారం నడపనున్నట్లు తెలియజేశారు. ఈ రైలు హవేరి, రాణిబెన్నూర్, హరిహర్, ధావణగెరె, చిగ్జాజుర్, కడూర్, అరిసికెరె, టుముకూరు, యల్హంక, హిందూపూరం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, బేగంపేట, సికింద్రాబాద్, ఖాజీపేట్, జమ్మికుంట, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, బాలార్షా, చంద్రాపూర్, నాగపూర్, ఆమ్లా, బేతూరు, ఇటార్సి, జబల్పూర్, కట్ని, సట్నా, మానిక్‌పూర్, ప్రయాగరాజ్ చౌకీ, మీర్జాపూర్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు. అలాగే హుబ్లీ-కటిహర్ ప్రత్యేక రైలు (నం. 07325) ఈనెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ప్రతి బుధవారం, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07326)ను ఈ నెల 12 నుంచి మే 3వ తేదీ వరకూ ప్రతి శనివారం నడుపనున్నట్లు తెలిపారు. ఈ రైలు గదగ్, కొప్పల్, హోస్పేట, తోరణగల్లు, బళ్లారి, గుంతకల్లు, డోన్, నంద్యాల, దిగువమెట్ట, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలేశ్వర్, ఖరగ్‌పూర్, డంకుని, బోలాపూర్ శాంతినికేతన్, మల్దా టౌన్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

చీనీకాయలు టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23,990 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 15వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1154 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఆర్జేడీ బ్లాగ్‌లో గ్రేడ్-2 హెచ్ఎంల జాబితా

అనంతపురం విద్య, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాల పరిధిలోని స్కూల్ అసిస్టెంట్లు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ పోస్టుల తాత్కాలిక సీనియారిటీ జాబితా http://rjdsekadapa.blogspot.comలో అందుబాటులో ఉందని డీఈఓ ప్రసాద్‌బాబు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యంతరాలుంటే... ఈనెల 11వ తేదీలోగా డీఈఓ కార్యాలయంలో తగిన ఆధారాలతో అందజేయాలని సూచించారు.

న్యూస్ బాక్స్

11వ డివిజన్‌లో సమస్యల పరిష్కారం

అనంతపురం అర్బన్ ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా 11వ డివిజన్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ దృష్టికి వచ్చిన పలు సమస్యలను ఒక్క రోజులోనే పరిష్కరించారు. ఓ మహిళ కొళాయి రిపేరు సమస్యను, మరో ప్రాంతంలో ప్రజలు బోరు సమస్య తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశంతో సంబంధిత అధికారులు ఒక్క రోజులోనే కొళాయి, బోరు సమస్యలను పరిష్కరించారు.

ఉద్యాన రైతులకు మెరుగైన సేవలు

● ఉద్యాన శాఖ ఇన్‌చార్జి డీడీ ఫిరోజ్ ఖాన్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉద్యాన రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖ ఇన్‌చార్జి డీడీ ఫిరోజ్ ఖాన్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం ఉద్యాన శాఖ ఇన్‌చార్జి డీడీగా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది క్రితం ఇక్కడ డీడీగా పనిచేస్తున్న రఘునాథ్‌రెడ్డిని ఏపీఎంఐపీ పీడీగా బదిలీ చేశారు. అప్పటి నుంచి ఏడీ నరసింహారావు ఇన్‌చార్జి డీడీగా కొనసాగుతున్నారు. ఇటీవల ఆయన అనారోగ్యంతో నెల రోజులపాటు సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్‌కు ఉద్యాన శాఖ ఇన్‌చార్జి డీడీగా ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పలువురు ఉద్యాన అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

పుస్తకావిష్కరణ


ప్రొఫెసర్ అంజులత రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్

అనంతపుం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో వేగంగా మారుతున్న ధోరణులపై పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ అంజులత రచించిన పుస్తకాన్ని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ పుస్తకం ప్రారంభస్థాయిలో ఉన్నవారి నుంచి ప్రావీణ్యంతో నేర్చుకోవాలనుకునే వారందరికి ఉపయోగపడే విధంగా ఉందన్నారు. పరిశోధనలలో 18 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ప్రొఫెసర్ అంజులతా రచించిన ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అతి త్వరలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్స్ ద్వారా అందు బాటులోకి రానున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రొఫెసర్ అంజులతాను విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్డాన, ఏఓ మనోహర్‌రెడ్డి అభినందించారు.

ముంటిమడుగు ఆర్థిక సాయం

గార్లదిన్నె, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నివాసముంటున్న టైలర్ నూర్‌బాషా వైద్యం ఖర్చులకు మంగళ వారం శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. నూర్‌బాషా కు ఇటీవల కాలు తొలగించారు. విషయం తెలుసుకున్న కేశవరెడ్డి మంగళవారం నూర్ బాషాను పరామర్శించారు. వైద్యం ఖర్చులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందచేశారు. ధైర్యాంగా ఉండాలని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆలం నరసానాయుడు, మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి, డీసీ చైర్మన్ శేఖర్, గేట్‌క్రిష్టారెడ్డి, పాండు, గుత్తా బాలకృష్ణ, గుర్రం శీనా, శేఖర్, సుంకన్న, వడ్లరాముడు, పవన్, రామాంజి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు : సీడీపీఓ


శింగనమలలో పక్షోత్సవాలు ప్రారంభిస్తున్న సీడీపీఓ

శింగనమల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ శింగనమల ప్రాజెక్టు పరిధిలో ని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ ఉమాశంకర రమ్మ తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల ప్రారంభం సందర్భంగా శింగనమలలో మంగళవారం సీడీపీఓ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు, రెండు సంవత్సరాల వయస్సు వరకు పిల్లల పౌష్టికాహారం, పర్యవేక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉమాదేవి,, దనలక్ష్మి, కౌసల్య, వాణిశ్రీ, హేమలత, నాగమణి, అన్నపూర్ణ, జ్యోతి, అంగన్ వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

● నార్పల: ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని తప్పక నిర్వహించాలని సీడీపీఓ భారతి పేర్కొన్నారు. నార్పలలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం పోషణ్ పక్వాడాపై అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ఈనెల 8నుంచి 22వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడాపై తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు రాజామణి, శాంతమ్మ, లావణ్య, సునాలని, మధుమాలిని, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


బోర్లు వేసేందుకు పూజ చేస్తున్న ఎంపీడీఓ తదితరులు

అనంతపుం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ దివాకర్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న అనంతసాగర్ చెరువు సమీపంలో బోర్లు వేసేందుకు ఎంపీడీఓ దివాకర్, టీడీపీ నాయకులు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..స్థానికంగా రూ.9 లక్షలతో నాలుగు బోర్లు వేస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా మండలంలోని ఆకుతోటపల్లి, ఇటుకలపల్లి, మన్నీల, కందుకూరు, చియ్యేడు గ్రామాల పరిధిలో నీటి సమస్యను నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిరు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరికుమార్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగే మురళీ మోహన్, నాయకులు మన్నీల షేక్షావలి నాయుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డీ... మీ ఇంట్లో వారికి న్యాయం చెయ్

● ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్


వృద్ధురాలితో సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డీ... ముందుగా మీ ఇంట్లో వారికి న్యాయం చేసి, ఆ తర్వాత ప్రజల వద్దకు రావాలని ఎమ్మె ల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచించారు. ఆయన మంగళవారం నగరంలోని 11వ డివిజన్‌లో మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. పాతూరు చెన్నకేశవస్వామి ఆలయం నుంచి ఇంటింటికి వెళ్లి సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో కనీసం ఒక డ్రైనేజీ కూడా తీయలేదని, తట్టెడు మట్టి ఎత్తలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని త్వరలోనే చేపడతామన్నారు. రూ.88 కోట్లతో నడిమివంక ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామన్నారు. రూ.16 కోట్లతో డంపింగ్ యార్డు క్లియ రెన్స్ పనులు చేపడతామని, త్వరలోనే మరోచోటికి తరలిస్తామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి తాము నిత్యం పని చేస్తున్నామన్నారు. మరోవైపు జగన్‌రెడ్డి పర్యటనపై ఎమ్మెల్యే స్పందించారు. జగన్‌కు మొదటి నుంచి శవ రాజకీయాలు చేయడం అలవాటేనన్నారు. సొంత బాబాయి హత్యను కూడా రాజకీయాలకు వాడుకున్నావంటూ జగన్‌పై మండిపడ్డారు. తల్లి, చెల్లికి న్యాయం చేసిన తర్వాతనే ప్రజల్లోకి రావాలన్నారు. పాపిరెడ్డిపల్లిలో క్షణికావేశంలో జరిగిన ఘటనను కులాలు, పార్టీలకు ఆపాదించడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, టీడీపీ నాయకులు గంగారామ్, రాయల్ మధు, రవికుమార్, రమేష్, సరిపూటి రమణ, కుంచెపు వెంకటేష్, సిమెంట్ పోలన్న, ఫిరోజ్ అహ్మద్, ఇస్మాయిల్, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వరన్, వీఎల్ఎన్ మూర్తి, సైఫుద్దీన్, ముక్తియార్, వెంకటేశ్వరరెడ్డి, బెస్త అంజి, వడ్డే భవానీ, మంజుల, కంఠాదేవి తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్తు : ఎంపీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్తు, నిర్మాణం యువత చేతుల్లోనే ఉందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కురుగుంట గ్రామంలో ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు మంగళవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎస్కేయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మురళీధర్‌రావు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మురళీధర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ... స్వామి వివేకానంద అడుగు జాడల్లో యువత నడవాలన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గం అలవరచుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కోసం ప్రజలు పాటుపడాలన్నారు. అనంతరం క్యాంపులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, ఎస్సార్ ఎడ్యుకుషనల్ వ్యవస్థాపకులు సుంకర రమేష్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సహదేవుడు, ఐకేసి కో ఆర్డినేటర్ జితేంద్ర, లెక్చరర్స్ శ్రీదేవి, శశాంక్‌మౌళి, ఆర్థిక అక్షరాస్యత కోర్డినేటర్ ప్రసిల్లా, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అనంతపురం అర్బన్ ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఇద్దరికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. నగర శివారులోని క్యాంప్ కార్యాలయంలో రమాదేవికి రూ.54,333, ఉమాపతికి రూ.25166 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, ఎంపీ అంబికాకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

భూవివాదంపై కలెక్టర్ పరిశీలన

ఆత్మకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన హరిజన లక్ష్మమ్మ అనే మహళ ఇచ్చిన రెవెన్యూ ఫిర్యాదుకు స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయన సమస్య పరిష్కారానికి అధికారులు, ఫిర్యాదుదారుతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆ భూమిని రామాంజనేయులు, ఓబన్న కేశవ హరీష్, జయకుమార్ తదితరుల సాగు చేసుకుంటున్నారు. అదే భూమిని హరిజన లక్ష్మమ్మ పేరిట సర్వేనంబరు 547-7లో నాలుగు ఎకరాల 24సెంట్లను భూపంపిణీలో పట్టా మంజూరు. చేశారు. దీంతో వారి మధ్య భూవివాదం ఉండడంతో కలెక్టర్ అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. రికార్డులను పరిశీలించి, గ్రామంలో విచారించి చట్టప్రకారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. బాధితులు కోర్టును ఆశ్రయించారని తీర్పు వచ్చే వరకు ఎవరూ తగాదాపడరాదని ఇరువురికి తెలియజేశారు. ఎలాంటి తగాదాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్, మండల సర్వేయర్ మధుర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ శవ రాజకీయాలు చేయడం దుర్మార్గం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి


మాట్లాడుతున్న దేవళ్ల మురళి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌రెడ్డి శవ రాజకీయాలు చేయడం దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళీ మండిపడ్డారు. ఆయన మంగళవారం స్థానిక టీఎన్‌టీయూ సీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాపిరెడ్డిపల్లిలో జరిగిన ఘటనకు, రాజకీయాలకు సంబంధం లేదన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చురేపే విధంగా జగన్ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. పోలీసులపై దురుసుగా మాట్లాడటం బాధాకరమన్నారు. టీడీపీ హయాంలో దాడులు, హత్యలు పెరిగాయని అబద్ధాలు వల్లించి ప్రజలను మభ్యపెట్టేందుకు జగన్ ప్రయతిస్తున్నారన్నారు. ఎవరి హయాంలో అరాచకాలు జరిగాయో అందరికీ తెలుసునన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి నేయులు, వడ్డే గంగరాజు, వంశీకృష్ణ, శివ, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసమే జగన్ పర్యటన

● టీడీపీ నాయకులు రామలింగారెడ్డి, పర్వతనేని శ్రీధర్‌బాబు


మాట్లాడుతున్న రామలింగారెడ్డి, శ్రీధర్‌బాబు

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్ రాజకీయ ఉనికి కోసమే శవ రాజకీయాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు విమర్శించారు. పాపిరెడ్డిపల్లిలో ఇటీవలే హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్ పర్యటనను వారు విలేకరులు సమావేశంలో ఖండించారు. రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదంపై వైసీపీ శవరాజకీయం చేయడం సిగ్గుచేటు అన్నారు. కుటుంబాన్ని పరామర్శించడానికి వచ్చి... ప్రశాంతంగా ఉన్న జిల్లాలో రెచ్చేకొట్టే వాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. బీసీ ఓట్లు కోసమే శవరాజకీయం చేశావా? అని జగన్‌పై మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా బీసీలు టీడీపీనే ఆదరిస్తారన్నారు.

ఉచిత కంటి పొర చికిత్సా శిబిరం

శింగనమల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర వలి గ్రామంలో పది రోజులు పాటు నిర్వహించే ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. శంకర నేత్రాలయ, పుట్టపర్తి బాజీ ఎడ్యుకేషన్ సొసైటీ, రాయలసీమ అసోసి యేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, గ్రామపెద్ద మారుతి నాయుడు సంయుక్త ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. ఈ నెల 17 తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో కంటి శుక్లం (పొర) ఆపరేషన్‌తోపాటు కంటి అద్దాలు, మందులు రోగులకు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలి: సీపీఎం


గ్యాస్ సిలిండర్‌ను రోడ్డుపై ఈడుస్తూ నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, రామిరెడ్డి పేర్కొన్నారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి క్లాక్‌టవర్ కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. గ్యాస్ సిలిండర్‌ను తాళ్లతో కట్టి రోడ్డుపై ఈడుస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సామాన్యులు వాడుకునే వంట గ్యాస్ ధరను కేంద్రం ఏకంగా రూ. 50 పెంచడం దారుణమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమ న్నారు. ఈ పెంపు ఉజ్వల పథకం లబ్ధిదారులకూ వర్తిస్తుందనడం మరీదా రుణమన్నారు. ఇప్పటికైనా పెంచిన ధరను వెంటనే ఉపసంహరించుకో వాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటనారాయణ, ముత్తుజ, ఇర్ఫాన్, వలి, జీవ, ఎన్టీఆర్ శీన, ఐద్వా నాయకులు చంద్రిక, అశ్విని, శంషాద్, రామాంజి, శంకర్, మోహన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఘనంగా బోనాలు


అలంకరణలో ఐదో రోడ్డు సుంకులమ్మ

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐదో రోడ్డులో వెలసిన నల్లమల సుంకులమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. భక్తులు తమ ఇళ్ల నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. కార్య క్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు ఉంగరాల శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

● రాప్తాడు: మండలంలోని రాప్తాడు, రామినేపల్లి, హంపాపురం, గొందిరెడ్డిపల్లి, యర్రగుంట, వరిమడుగు, బోగినేపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం వైభవం గా బోనాల ఉత్సవం నిర్వహించారు. ఆ యా గ్రామాల్లో పెద్దమ్మ మారెమ్మ తది తర గ్రామదేవతలకు బోనాలు సమర్పిం చి పొట్టేళ్లు, మేకలను బలి ఇచ్చారు.

● రామగిరి: మండలంలోని కుంటిమద్ది ఎస్సీ కాలనీలోని ఆదిపరాశక్తి పెద్దమ్మ దేవత ఆలయంలో స్థానికులు మంగళవారం జ్యోతులు, బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రి గ్రామంలోని పెద్దమ్మ దేవత, బీరప్ప స్వామి, కొల్లాపురమ్మ, దుర్గమ్మదేవతలను ఊరేగించారు. మంగళవారం పెద్దమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలయ ప్రదక్షిణలతో జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.




అలంకరణలో రాప్తాడు మారెమ్మ

కుంటిమద్ది పెద్దమ్మ దేవత

హంసవాహనంపై సరస్వతీదేవిగా రామచంద్రుడు


సరస్వతీదేవి అలంకరణలో స్వామివారు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజున మంగళవారం మొదటిరోడ్డులోని కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో రామచంద్రుడు హంసవాహనంపై సరస్వతీదేవి అలంకారంలో ఊరేగారు. ఈ సందర్భంగా ఉదయం సీతారాములకు వివిధ అభిషేకాలు, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో హంసవాహనంపై స్వామివారిని సరస్వతీదేవి అలంకారంలో ఆశీనులు గావించి పురవీధులగుండా ఊరేగించారు. నగరోత్సవానికి ముందు భక్తులు రామకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేస్తూ ముందుకు సాగారు. రాత్రికి స్వామివార్లకు దశహారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, అనువంశీకుడు హోసూరు రామ సుబ్రహ్మణ్యం, జీజే వేణు, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయం పునర్నిర్మాణానికి కృషి: ఎమ్మెల్యే

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మొదటిరోడ్డులోని పురాతన కాశీవిశ్వేశ్వరాలయం పునర్నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం తన చాంబర్‌లో ఆలయ ఈఓ శోభతో పాటు భక్తులతో సమావేశమై, ఆలయ నమూనా పత్రాలను పరిశీలించారు. ప్రస్తుతం పునర్నిర్మాణం కోసం దేవదాయశాఖ డిప్యూటీ ఇంజనీర్ రూ. 4.50కోట్లతో అంచనాలు సిద్ధం చేశారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి ఈఓ తీసుకెళ్లారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన అన్ని అంశాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆలయ పునర్నిర్మాణ అంశాన్ని దేవదాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా నిధులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ భక్తమండలి సభ్యులు దాడి శ్రీనివాసులు చౌదరి, నరేంద్రచౌదరి, జీజే వేణు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచన


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శింగనమల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం నుంచి నియోజక వర్గంలోని గురుకుల, మోడల్ పాఠశాలలు, కేజీబీవీల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. ఎమ్మెల్యే మంగళవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఉన్న జీఓ 117 రద్దు తరువాత, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న విద్యా క్యాలెండర్ గురించి చర్చించారు. అడ్మిషన్లు జరిగేలోగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. మరమ్మతు పనులను సకాలం పూర్తి చేయాలన్నారు. వేసవిలో నిర్వహించే ఒంటిపూట బడులలో విద్యార్థులకు నీరు, ఇతర సౌకర్యాలలో సమస్యలు రాకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

నేడు ఎమ్మెల్యే శింగనమలకు రాక: ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బుధవారం శింగనమలకు రానునట్లు ఎంపీడీఓ భాస్కర్, టీడీపీ మండల కన్వీనర్ ఆదినారాయణ తెలిపారు. ఆమె ఉదయం శింగనమలలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యాక్రమం ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమావేశానికి ఎమ్మెల్యే హాజరువుతారని తెలిపారు. కావున మండలలోని అధికారులు ప్రజాప్రతినిధులు, టీడీపీ శ్రేణులు హాజరు కావాలని ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీరామనవమి రోజున ఉపాధి పనులా?

● విచారణ జరిపించాలి

● డ్వామా పీడీకి ఏపీ వ్యవసాయ కార్మికసంఘం వినతి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండుగ రోజున జిల్లాలో ఉపాధి పనులు కల్పించడంపై విచారణ జరిపించి అక్రమాలకు బాధ్యులైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు మంగళవారం డ్వామా పీడీ సలీంబాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ... శ్రీరామనవమి రోజు జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులు కల్పించినట్లు బోగస్ మస్టర్లు వేయడం దారుణమని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా ఎంతో ఘనంగా జరుపుకునే పండుగ రోజు జిల్లాలో 22మండలాల్లోని 78గ్రామాల్లో 457పనులను 2757 మంది కూలీలు చేసినట్లు, పాత పనుల వద్ద ఫొటోలు నమోదు చేయడంపై విచారణ జరిపించాలన్నారు. ఒకే ఫొటోను ఐదుగ్రామ పంచాయతీల్లో నమోదు చేసిన మస్టర్లలో అప్‌లోడ్ చేసినట్లు గుర్తించామన్నారు. కార్మికసంఘం పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించగా అక్కడ పనులే జరగలేదని చెబుతున్నారని తెలిపారు. అలాగే 22 మండలాల్లోని 91 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పథకం పనుల బోగస్ మస్టర్లు నమోదు చేశారన్నారు. ఇక వేసవిలో పనిచేసే చోటు నీడ, మంచినీరు, మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. పీడీ స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఆ సంఘం జిల్లా ఉప కార్యదర్శి పెద్దయ్య, గిరిజన సమాఖ్య నాయకులు రామాం.నేయులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

● ఐఓబీ చీఫ్ రీజనల్ మేనేజర్ సంజయ్‌కుమార్


నూతన భవనంలో బ్యాంకును ప్రారంభిస్తున్న చీఫ్ రీజనల్ మేనేజర్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులకు మెరుగైన సేవలు, వసతులు కల్పించడమే లక్ష్యమని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు చీఫ్ రీజనల్ మేనేజర్ సంజయ్‌కుమార్ తెలిపారు. హౌసింగ్‌బోర్డులో ఉన్న ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకును విద్యుత్‌నగర్ మెయిన్‌రోడ్డులో ఉన్న నూతన భవనంలోకి మార్చారు. చీఫ్ రీజనల్ మేనేజర్ సంజయ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు అనువుగా మెరుగైన సేవలు అందించడానికి విశాల ప్రాంగణంలోకి బ్యాంకును మార్చామని తెలిపారు. నూతన భవనంలో కార్యకలాపాలు కొనసాగుతాయని, ఖాతాదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఓబీ చీఫ్ మేనేజర్ అనీష్, మేనేజర్లు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలకు వినతుల వెల్లువ


మంత్రికి వినతిపత్రాన్నిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా పరిశీలన కోసం మంగళవారం గుంతకల్లుకు వచ్చిన జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును స్థానిక రైల్వే కోజీ గెస్టుహౌస్ వద్ద వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కలిసి పలు విజ్ఞప్తులు చేశారు. సీపీఐ నాయకులు రాయల్ రాము, వీరభద్రస్వామి, గోపీనాథ్ కలిసి నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీనీవా నుంచి నీరందించే విషయంగా వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం నాయకులు శ్రీనివాసులు, మారుతీ ప్రసాద్ హంద్రీనీవా, జీబీసీకు సంబంధించి వినతిపత్రాన్ని సమర్పించారు. కసాపురం దేవస్థాన ఏఈఓ వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ పిడికిటి వెంకటేశులు, అర్చకుడు చక్రవర్తి, తదితరులు దేవస్థానానికి నీటి అవసరాల కోసం వెంకట్రాయ చెరువుకు హంద్రీనీవా నుంచి నీటిని పంప్ చేసుకోవడానికి అనుమతులను ఇప్పించాలని విన్నవించారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

ఉరవకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి గ్రామంలో అభయాంజనేయ స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ఏడుజతల వృషభాలు పాల్గొన్నాయి. పోటీలు హోరాహోరీగా సాగాయి. బొమ్మనహాళ్ మండలం లింగదహాళ్ గ్రామానికి చెందిన ఎ త్రిస్వామి వృషభాలు మొదటిస్థానంలో నిలిచాయి. వీటి యజమానికి గాదిలింగ రూ.20వేలు నగదు బహుమతి అందజేశారు. అలాగే విడపనకల్లు మండలం పొలికికి చెందిన పూజారి బండయ్య వృషభాలు రెండవ స్థానం సాధించాయి. దక్కించుకున్నాయి. వీటి యజమానికి అఖిల్ రూ.10వేలు బహుమతిని అందించారు. బొమ్మనహాల్ మండలం ఉద్దేహాళ్‌కు చెందిన బసన్న వృషభాలు మూడవ స్థానం సాధించాయి. వీటి యజమానికి కమిటీ సభ్యులు రూ.5వేల నగదును అందజేశారు.

● తాడిపత్రి: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని కృష్ణాపురం జీరోరోడ్డులోగల గంగమ్మ ఆలయం వద్ద రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి 18జతల వృషభాలు పోటీలో పాల్గొన్నాయి. వీటిని తిలకించడానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

బీజేపీని బలోపేతం చేయాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ కార్యకర్తలకు సూచించారు. పట్టణంలోని ఇల్లూరు భవనంలో మంగళవారం పార్టీ గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం జరిగింది. కొనకొండ్ల రాజేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొలమి రామాంజినేయులు, నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ జవాన్ మృతికి ఘన నివాళి

గుత్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 21వ వార్డు లో నివాసముంటున్న రిటైర్డ్ ఆర్మీ జవాన్ అల్లాబకాష్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, తహసీల్దార్ ఓబులేసు.. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అలాగే కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. ఎక్స్ సర్వీస్ మెన్ కమిటీ నాయకులు కూడా నివాళులర్పించారు.

ఆశా కార్యకర్తల సమీక్ష

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని తెలిపారు. ఉదయాన్నే ఉపాధి హామీ కూలీలు దగ్గరకు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. వైద్యసిబ్బంది ఎన్‌సీడీ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశం అనంతరం 54 మంది ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేశారు. సీహెచ్‌వో రాణి ఎస్తేర్, సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు తెలిపారు.

పోస్టర్ల విడుదల

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన పోషణ్ పక్వాడ్ పోస్టర్లను పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఆర్డీఓ వసంత్‌బాబు, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పోషణ ప్రాధాన్యత గురించి లబ్ధిదారులకు వివరించాలన్నారు. అలాగే వెయ్యి గోల్డెన్ డేస్ గురించి ప్రతి ఒక్కరికి తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత జీవనశైలిలో పౌష్టికాహార ప్రాధాన్యతపై ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సీడీపీవో తెలిపారు. ఎంపీడీఓ రామచంద్ర, వైద్యాధికారి డాక్టర్ రాజేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఆర్టీటీ రీజనల్ డైరెక్టర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలి

తాడిపత్రి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయని వారి జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపాలని బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ. ఓబులు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన బీడీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1966చట్టం జీఓనెంబరు 41తో కార్మికుల జీవితాలు నష్టపోతున్నాయన్నారు. పలు రాష్ట్రాల్లో బీడీ కార్మికులకు పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, వారి పిల్లలకు స్కాలర్‌షిప్ తదితర సౌకర్యాలు ఉన్నాయన్నారు. కానీ తాడిపత్రిలో మాత్రం సంక్షేమ పథకాలు అమలుకాక దుర్భరపరిస్థితిలో ఉన్నారని తెలిపారు. ఏళ్ల గడుస్తున్నా వారికి రూ.200 కూలీనే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 16న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు తరలిరావాలని ఆయన కోరారు. అనంతరం తాడిపత్రి బీడీ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూర్జహాన్, ప్రధాన కార్యదర్శులుగా అరిఫా, రహీంబీ, ఉపాధ్యక్షులుగా ఇమాంబీ, బసిరున్‌తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. సీఐటీయూ నాయకులు నరసింహారెడ్డి, రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఉరవకొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వివిధ సామాజిక వర్గాల కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధికి నిధులను మంజూరు చేసిన సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. పట్టణంలో కురుబ కమ్యూనిటీ హాల్‌కు రూ.50లక్షలు నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ కురుబ సంఘం నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. అలాగే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు చాబాల ఈశ్వర్, జియోశీన, బ్యాళ్ల ఈశ్వరయ్య, తిమ్మప్ప, సదానంద, లింగమూర్తి, గోపాల్, ప్రభాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే నాయీబ్రహ్మణ కమ్యూనిటీ హాల్‌కు రూ.30లక్షలు విడుదల చేసిందుకు కృతజ్ఞతగా నాయిబ్రహ్మణ సంఘం నాయకులు హరికృష్ణ, రామలింగ, భాస్కర్ తదితరులు సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. శ్రీకృష్ణదేవరాయ కమ్యూనిటీ భవనానికి రూ.20లక్షల నిధులు మంజూరు చేసినందుకు బలిజ సంఘం నాయకులు దండాకృష్ణ ప్రసాద్, సూరి, లాయర్ తుకారాం తదితరులు మంత్రి కేశవ్‌ను కౌకుంట్లలో కలిసి సన్మానించారు.


కేక్ కట్‌చేస్తున్న కురుబసంఘం నాయకులు

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని జీబీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్యాలయం ఆవరణలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) సంయుక్తంగా మహిళలకు ఏర్పాటు చేసి కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఐఓసీ సంస్థ పట్టణంతో పాటు నక్కనదొడ్డి పంచాయతీలోనూ రూ. 45 లక్షల వ్యయంతో కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత 296 మందికి కుట్టుమిషన్లను పంపిణీ చేస్తామన్నారు. మహిళల సంక్షేమానికి సీఎం చంద్రబాబు సైతం ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐఓసీ చీఫ్ డిపో మేనేజర్ నవీన్ కుమార్, న్యాక్ సహాయ సంచాలకుడు గోవిందరాజులు, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, వాసగిరి మణికంఠ, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, మస్తాన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ వినతి

గుంతకల్లుటౌన్: పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. 60మంది విద్యార్థులు ఉన్న ప్రతిపాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్పు చేయాలన్నారు. విద్యాశాఖ చేపడుతున్న పలు సంస్కరణలు వల్ల విద్యారంగంలో కలిగే దుష్పరిణామాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కల్పన, గిరిబాబు, గౌరవాధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు పాల్గొన్నారు.

సదరం క్యాంపుపై రచ్చ..


సూపరింటెండెంట్‌తో వాగ్వాదం చేస్తున్న సదరం క్యాంపునకు వచ్చినవారు

తాడిపత్రి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మంగళవారం సదరం క్యాంపు నిర్వహణపై రచ్చ కొనసాగింది. ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం క్యాంప్‌నకు మడకశిర, అగళి, రాయదుర్గం, కదిరి తదితర ప్రాంతాల నుంచి స్లాట్ బుకింగ్ చేసుకుని చాలామంది వచ్చారు. ఇక్కడకు వచ్చాక కంటి డాక్టర్ ఉన్నారు.. కానీ పరీక్షించేందుకు సామగ్రిలేదని సిబ్బంది తేలిగ్గా చెప్పారు. ఇందుకు కంటి పరీక్షలకు వచ్చిన వారు సూపరింటెండెంట్ డేవిడ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో వ్యయప్రయాసల కోర్చి ఆస్పత్రికి వచ్చామని, తీరా ఇక్కడికి వచ్చాక సదరం క్యాంపు లేదంటే ఎలా అంటూ సూపరింటెండెంట్‌తో వాగ్వాదానికి దిగారు. ఏదిఏమైనా మాకు కంటిపరీక్షలు చేసి తీరాలని, లేకపోతే ఇక్కడ సామగ్రి లేదని రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో సూపరింటెండెంట్ డీసీఎంహెచ్‌ఓకు ఫోన్‌చేసి సమాచారం చేరవేశారు. ఇక్కడ కంటికి సంబంధించి మెటీరియల్ లేవని, స్లాట్ బుకింగ్ ఎలా ఇచ్చారని, ఇక్కడకు వచ్చిన వారికి సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. డీసీఎంహెచ్‌ఓ తాను మంత్రి ప్రోగ్రాంలో ఉన్నాను తర్వాత ఏదోఒకటి చేద్దాములే అంటూ దాటవేశారు. మధ్యాహ్నం 2గంటలైనా సమాచారం అందకపోవడంతో వారు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి నుంచి అధికారులే స్లాట్ బుకింగ్ ఇచ్చారు మేము ఏమి చేయాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. ఒక్కసారి స్లాట్ బుకింగ్ అయితే మరలా చేసేందుకు వీలుపడదని, ఎలాగైనా న్యాయం చేయాలని వారు ఒత్తిడి చేశారు. దీంతో చేసేది లేక బయట నుంచి సామగ్రి తెప్పించి ఈరోజు ఉన్న సదరం క్యాంప్ పూర్తిచేశారు. వచ్చేవారం సదరం క్యాంపు ఎలా చేయాలో అర్థం కాలేదని సూపరింటెండెంట్ ఆవేదన వ్యక్తం చేశారు.

భిక్షాటనతో శ్రీరామిరెడ్డి కార్మికుల నిరసన


భిక్షాటన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోరుతూ పట్టణంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి టీ సర్కిల్ వరకు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుంటే గత్యంతరం లేక సమ్మె చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు, ఈపీఎఫ్ చెల్లించాలని అనేక సార్లు కాంట్రాక్టర్ దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. సమస్యలను పరిష్కరించాలని అడిగితే కాంట్రాక్టర్ కార్మికులను తొలగిస్తామంటూ బెదిరించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజాప్రతినిధులైనా స్పందించి వెంటనే కార్మికులకు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు రంగనాథ్, కార్మికుల యూనియన్ జిల్లా ట్రెజరర్ వన్నూరుస్వామి, నాయకులు నరేష్, నాగరాజు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలి: సీపీఎం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరను ఏకంగా రూ.50 పెంచి సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపడం దారుణమని, పెంచిన ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణంలో ఈమంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ఉన్న పరిస్థితుల్లో పెరిగిన నిత్యవసర సరుకులు భారంగా మారాయని, ఇదిచాలదన్నట్లు గ్యాస్ సిలిండర్‌పై రూ. 50 పెంచడాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని అన్నారు. కేంద్ర గ్యాస్ ధరలను పెంచి కార్పొరేటర్లకు వత్తాసు పలకడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకపోతే దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

● కణేకల్లు: కేంద్రం గ్యాస్ ధరను పెంచడాన్ని సీపీఎం వ్యతిరేకిస్తోందని, తక్షణమే పెంచిన ధరను తగ్గించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి కోరి నాగరాజు ప్రకటనలో డిమాండ్ చేశారు. ధరలను తగ్గించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మండల సమావేశాల్లో సమస్యలపై నిలదీత

పామిడి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల ధికారులు తమ శాఖ సమాచారాన్ని తెలియజేశారు. విద్యాశాఖ సమాచారం తెలియజేస్తున్న తరుణంలో ఎంఈఓ జయానాయక్, రామగిరి ఎంపీటీసీ సభ్యుడు మజ్జిగ రాజశేఖర్ మధ్య మాటల యుద్ధం జరిగింది. సమస్యలపై స్పందన కరువైందని ఎంపీటీసీ నిలదీశారు. రామగిరి దిగువతండా, దిబ్బసానిపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల సమస్యలు ఎన్నడు తీరుతాయని, మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశంలో ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలపై పరిష్కారం ఏదీ అని ప్రశ్నించారు. ఎంపీడీఓ, ఎంపీపీ కలుగజేసుకొని ఇద్దరికీ సర్దిచెప్పారు. అనంతరం ట్రాన్స్ కో ఏఈ మధుసూదన్ ప్రధానమంత్రి సూర్య ఘర్ వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో ఎంపీడీఓ తేజోత్స్న, తహసీల్దార్ శ్రీధరమూర్తి, వైస్ ఎంపీపీ కాయల మహేష్, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

● పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులోగ్రామాలప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని కోరారు. ఎంపీడీఓ బారెన్‌సాబ్, అధికారులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల పరిశీలన

యాడికి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతోపాటు రాయలచెరువులోని రైతుసేవా కేంద్రాలను వ్యవసాయ శాఖ ధర్మవరం ఏడీఏ కృష్ణయ్య, ఏఓ మహబూబ్‌బాషా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. రైతుల ప్రత్యేక గుర్తింపు నెంబరు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలని తెలిపారు. రాబోవు ఖరీఫ్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన ఇండెంట్లను ముందుగానే ఇవ్వాలని సూచించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

గుత్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు,పట్టణ కార్యదర్శి నిర్మల, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా.. కార్మికుల తలరాతలు మారటం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్ విధానాన్ని రద్దు చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. దీన్ని తిప్పికొట్టేందుకు పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ నెంబరు 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టి మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయాకు వినతి పత్రం అందజేశారు. నాయకులు సూర్యనారాయణ, రామాంజనేయులు, రాజా, శ్రీనివాసులు, చంద్ర, మురళి, వెంకటలక్షి పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కారవేదిక

బెళుగుప్ప, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ అధ్యక్షతన ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరగనున్నట్లు ఆర్డీఓ వసంతబాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏఓ పృథ్వీ సాగర్, ఎస్ఐ శివ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ప్రజా దర్బార్

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ప్రజా దర్బార్‌ను నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని సమస్యలపై అర్జీలను నేరుగా ప్రభుత్వ విప్‌కు ఇవ్వాలని సూచించారు.

ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏక మొత్తంలో చెల్లించిన వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నును ఈ నెల 30వ తేదీ లోపు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గల క్యాష్ కౌంటర్ లో చెల్లించి, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

కంబగిరిస్వామి ఆలయానికి ప్రత్యేక బస్సులు

యాడికి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా అవుకు మండలంలోని కంబగిరిస్వామి తిరుణాల సందర్భంగా యాడికి మండలకేంద్రం నుంచి ఆలయం వద్దకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ తాడిపత్రి డిపో మేనేజర్ శంకర్, ఏడీఎం నందిని మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11, 12వ తేదీల్లో బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రిప్ పరికరాల దగ్ధం

బెళుగుప్ప, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నరసాపురంలో సోమవారం సాయంత్రం ఐదు ఎకరాల వ్యవసాయ తోటలో డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. బ్రాహ్మణపల్లికి చెందిన ఓబులేసు నరసాపురంలో పొలాన్ని కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. అయితే నిప్పంటుకుని ఆ పొలంలోని డ్రిప్ పరికరాలన్నీ కాలిపోయాయి. రూ. లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారనే అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మామిడి చెట్లు ..

గుత్తిరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాచుపల్లిలో మామిడి చెట్లు కాలిపోయాయి. గ్రామానికి చెందిన చిక్కాల జమ్మన్న తన మూడెకరాల పొలంలోని 4ఏళ్ల క్రితం మామిడి సాగు చేశారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం బీడీ తాగి పొలం గట్టుపై పడేయడంతో మంటలు వ్యాపించి 25 మామిడి చెట్లు కాలిపోయాయి. రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గోనేహాళ్‌లోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయ భారతి మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. తల్లిదండ్రులు పిల్లలకు బాల్యవివాహాలు చేయకుండా చదివించాలని సూచించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుత సంచారం..

ఉరవకొండ,ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం ప్యాపిలి, వెంకటాంపల్లి రహదారిలోని తూరాత్ కొండపై మంగళవారం చిరుత సంచరిస్తుండడాన్ని చూసి ప్రజలు భయాందోళన చెందారు. పొలాలకు వెళ్లిన రైతులు పరుగులు తీశారు. అటవీ అధికారులు దానిని బంధించాలని ప్రజలు కోరారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు


తక్కళ్లపల్లిలో పూజలందుకుంటున్న పెద్దమ్మ

పుట్లూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే ఆయా ఆలయాల్లోని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. గాండ్లపాడులో సుంకులమ్మతల్లికి, తక్కళ్లపల్లి కొండేపల్లి గ్రామాల్లో పెద్దమ్మతల్లికి, సూరేపల్లిలో చౌడమ్మ తల్లికి గ్రామస్థులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జాతర

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లాపురం, పల్లెపల్లి ప్రజలు మంగళవారం చౌడేశ్వరీదేవి జాతరను ఘనంగా నిర్వహించారు. అ సందర్భంగా ఆయా గ్రామాల సమీపం లో ఉన్న ఆలయంలో అమ్మవారికి వేకువజామునే అర్చకులు గంగాజలం తెచ్చి అభిషేకం చేశారు. తర్వాత ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. గ్రామాల ప్రజలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమలతో పూజించి జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతరతో రెండు గ్రామాల్లో సందడి నెలకొంది. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అమ్మవారిని దర్శంచుకుని పూజలు చేయించారు. టీడీపీ కన్వీనర్లు హనుమంతరెడ్డి, హనుమంతు, జంజరంపల్లి సర్పంచ్ వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యాఘ్రవాహనంపై ఊరేగింపు

కూడేరు, ఏప్రిల్ 8, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం ఈడిగ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో జోడులింగాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం రాత్రికి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను వ్యాఘ్రవాహనంలో కొలువుదీర్చి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు సాగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ పోస్టర్ల ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వీరహనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు పట్టణంలో బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ ఉదయం 9గంటలకు బీరప్ప గుడి సర్కిల్ నుంచి మొయిన్‌రోడ్డు, సత్యనారాయణపేట మీదుగా కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు మణిక్‌చంద్‌కార్వా, కార్యదర్శి రఘురాం, ప్రాంత సేవాప్రముఖ్ రామ్మూర్తి, భజరంగ్‌దళ్ రాష్ట్ర కోకన్వీనర్ కసాపురం రవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, సీనియర్ నాయకుడు అంకాల్‌రెడ్డి, జనసేన పట్టణ ఇన్చార్జి వాసిగిరి మణికంఠ, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు గోపాజగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొండ తిమ్మప్ప రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విడపనకల్లు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకముక్కల గ్రామంలో కొండ తిమ్మప్ప రథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి కొండపై వెలసిన కొండ తిమ్మప్ప స్వామికి అర్చకులు, గ్రామస్థులు ఉదయమే ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం కొండ కింద నున్న ఆలయంలోని ఉత్సవ మూర్తులను ప్రత్యేక పూలతో అలంకరించి కొండ వద్ద వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడి రథంలో కొలువుదీర్చి ఆలయం వద్ద వరకూ అశేష భక్త జనం నడుమ లాగారు. అలాగే తిరిగి కొండ వద్దకు చేర్చారు. బుధవారం వసంతోత్సవంతో కొండ తిమ్మప్ప రథోత్సవ వేడుకలు ముగుస్తాయి.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

గుత్తి రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కర్నూలు జిల్లా ఆలూరులోని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నివాసంలో మంగళవారం వారు పార్టీతీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన అసేన్, హుసేన్‌బాషా, షాకీర్, మహబూబ్‌బాషాతో పాటు మరో 10 కుటుంబాల వారు పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ఏంకే చౌదరి, నాయకులు చికెన్ శీనా, ప్రతాప్, పులికొండ, రామాంజునేయులు, నాగరాజు పాల్గొన్నారు.

అప్పుల బాధతో అన్నదాత ఆత్మహత్య


బూదేడు వెంకటేష్ (ఫైల్)

కూడేరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్రకోడు గ్రామానికి చెందిన రైతు బూదేడు వెంకటేష్(42) అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేష్‌కు రెండున్నర ఎకరాల పొలం ఉంది. ఇందులో బ్యాడిగ మిరప, వేరుశనగ సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.3.50 లక్షలు అప్పు చేశాడు. దిగుబడి సరిగా రాకపోవడంతో నష్టపోయాడు. దిక్కుతోచని స్థితిలో గ్రామ సమీపంలోని ఓ రైతు తోటలో గత ఆదివారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య లావణ్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) మండలంలోని సిద్ధరాంపురం గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ రమేష్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, బొమ్మనహాళ్ ఏఓ సాయికుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జొన్న సాగు చేసిన రైతులు చాలా రోజులేగా ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలని కోరుతున్నారని, వారి కోరిక మేరకు వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. 2024 లో ఈకేవైసీ చేయించిన రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు నమోదు చేయించుకుని జొన్నలు కేంద్రంతో విక్రయించాలని సూచించారు. కణేకల్లు స్టాక్ పాయింట్ అధికారి సుధాకర్, ఉద్దేహాళ్ సీఈఓ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.